

యథేచ్ఛగా చెరువుల తవ్వకం

చిన్నాపురం-మాజేరు మధ్య ఓ బడాబాబు నిర్వాకం

పంట పొలాల మధ్య తవ్వకాలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

ఏడాదికి రెండు పంటలు పండే భూముల మధ్య చేపలు, రొయ్యల చెరువులు తవ్వేస్తున్నారు. మచిలీపట్నం మండలం చిన్నాపురం, చల్లపల్లి మండలం మాజేరు రెవెన్యూ గ్రామాల పరిధిలోని 50 ఎకరాల భూముల్లో చెరువుల తవ్వకాన్ని మంగళవారం ప్రారంభించారు. ఖరీఫ్ సీజన్‌లో వరి, రబీ సీజన్‌లో మినుము పంటలు పండే భూముల మధ్య ఎలాంటి అనుమతులు లేకుండా చేపలు, రొయ్యల చెరువులు తవ్వుతున్నారని, దీంతో ఇక తమ పొలాల్లో పంటలు పండే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల తవ్వకాలను నిలిపివేయాలని చిన్నాపురానికి చెందిన రైతులు గత వారం రోజులుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

- అడ్డుకోవడం మా వల్ల కాదన్న రెవెన్యూ అధికారులు!
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన చిన్నాపురం గ్రామ రైతులు
- పంటలు, తాగునీటి ఇబ్బందులు వస్తాయని ఆవేదన
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మరుసటి రోజు నుంచే పనులు ముమ్మరం


చిన్నాపురంలోని పంట పొలాల్లో చెరువు తవ్వకం పనులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలం చిన్నాపురానికి చెందిన 200 మందికిపైగా చిన్నకారు రైతులకు మాజేరు-చిన్నాపురం గ్రామం సరిహద్దున భూములు ఉన్నాయి. రైతులంతా అరెకరం నుంచి రెండు ఎకరాల భూములు ఉన్నవారే. ఈ భూముల మధ్యలో 50 ఎకరాల విస్తీర్ణంలో చేపలు, రొయ్యల చెరువులు తవ్వేపనులను ప్రారంభించారు. గతేడాది ఇదే పంట పొలాల మధ్య చెరువులు తవ్వేందుకు ప్రయత్నించగా, రైతులు అభ్యంతరం పెట్టడంతో ఈ పనులు నిలిచిపోయాయి. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఓ బడాబాబు ఈ భూములను లీజుకు తీసుకున్నాడు. తాను ఓ మాజీ ఎమ్మెల్యేకు వేలు విడిచిన బంధువునని, చెరువుల తవ్వకాలకు సంబంధించి అధికారులతో అన్ని రకాలుగా మాట్లాడుకున్నామని చెబుతూ నానా హంగామా చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న చిన్నాపురం గ్రామానికి చెందిన రైతులు భూములు చల్లపల్లి మండలం మాజేరు రెవెన్యూ గ్రామ పరిధిలో ఉండటంతో గత నాలుగైదు రోజులుగా చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయాకి వెళ్లి తహసీల్దార్ వనజాక్షికి విషయం వివరించారు. పంట భూముల మధ్య చేపలు, రొయ్యల చెరువులు తవ్వితే ఇక ఈ ప్రాంతంలో వరి, మినుము పంటలు సాగు చేయడానికి అవకాశం ఉండదని, పంట పొలాల్లోని మురుగు నీరు త్వరితగతిన బయటకు పోదని చెప్పారు. మొదటిరోజు అక్కడేమీ చెరువుల తవ్వకాలు జరగడం లేదని, అయినా పరిశీలిస్తామని చల్లపల్లి రెవెన్యూ అధికారులు సమాధానం ఇచ్చారు. రెండో రోజు సిబ్బందిని పంపి పరిశీలిస్తామని చెప్పారు. మూడో రోజు చెరువుల చుట్టూ మురుగు నీరు పోవడానికి కాలువలు ఏర్పాటు చేస్తారని, ఇది పెద్దలతో కూడుకున్న వ్యవహారమని, తామేమీ చేయలేమని తహసీల్దార్ తమతో చెప్పి పంపేశారని చిన్నాపురం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చివరగా గత సోమవారం సాయంత్రం కలెక్టర్ బాలాజీ వద్దకు వచ్చి పంట పొలాల మధ్య చెరువులు తవ్వుతున్నారని, బోర్లు కూడా వేశారని, పంట పొలాల మధ్య చెరువులు తవ్వితే ఇకనుంచి పంటలు పండకపోవడంతోపాటు భూగర్భ జలాలు కలుషితమవుతాయని వినతిపత్రం అందించి తమగోడు వెళ్లబోసుకున్నారు. అయితే మంగళవారం ఉదయానికే 100కుపైగా ట్రాక్టర్లు, పది జేసీబీలు, ఐదు డోజర్లు పెట్టి చెరువుల తవ్వకం పనులు ప్రారంభించడం గమనార్హం.

తాగునీటిని అందించే గ్రామంలో ఇక కష్టాలు

సముద్ర తీరంలో చిన్నాపురం గ్రామం ఉన్నప్పటికీ ఈ గ్రామ పరిధిలో భూగర్భ జలాలు తాగడానికి పనికి వస్తాయి. తాగునీటి ఎద్దడి నెలకొన్న సమయంలో చిన్నాపురం గ్రామ పరిధిలో ఉన్న బోర్లలోని నీటిని చిన్నాపురం గ్రామంతో పాటు చుట్టుపక్కల ఉన్న తుమ్మలచెరువు, యాదర, సింహాచలం, వాడపాలెం, వెంకట దుర్గాంబపురం తదితర 15 గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ తాగునీటి పథకం ద్వారా తాగునీటిగా సరఫరా చేస్తూ ఉంటారు. చిన్నాపురం గ్రామంలోని చేతి పంపుల ద్వారా వచ్చిన నీటిని గ్రామస్తులు వాడుకుంటూ ఉంటారు. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామం పక్కనే ఉన్న పంట భూముల్లో చెరువులను తవ్వి, ఉప్పునీటిని పెట్టి రొయ్యలు సాగు చేస్తే భూగర్భ జలాలు ఉప్పునీటిగా మారిపోతాయనే భయం గ్రామస్తులను వెంటాడుతోంది. తీరంలోని ఈ గ్రామాలకు తాగునీటి అవసరాల కోసం చిన్నాపురంలోని భూగర్భ జలాలు మినహా, మరో ప్రత్యామ్నాయం లేదనే విషయాన్ని అధికారులను కలసిన సమయంలో గ్రామస్తులు వివరించారు. అయినా ఈ అంశాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన గోవాడ వెంకటేశ్వరరావు, చలమలశెట్టి వెంకటరమణ, నూకల పున్నారావు తదితరులు వాపోతున్నారు. చిన్నాపురం గ్రామ రైతులకు చెందిన పంట పొలాల మధ్య చెరువులు తవ్వితే పంటలు పండకపోవడం ఒక ఇబ్బంది కాగా, భూగర్భ జలాలు ఉప్పునీటిగా మారి తమ గ్రామంతోపాటు మిగిలిన మరో 15గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడతారని చెబుతున్నారు. అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి, వాస్తవాలను గ్రహించి తదుపరి చ ర్యలు తీసుకోవాలని చిన్నాపురం రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

బిల్లు గుభేల్

దడ పుట్టిస్తున్న విద్యుత్ చార్జీలు

- 154 యూనిట్లు వాడితే రూ.5,436 బిల్లు
- మార్చి నెలలో వినియోగదారులకు 'షాక్'
- కొత్తగా అదనపు లోడ్ చార్జీలు
- గగ్గోలు పెడుతున్న ప్రజలు



- రామ్‌ప్రసాద్ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. ఆయనకు ఇంట్లో ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, ఏసీ, స్మార్ట్ టీవీ, ఫ్యాన్ ఉన్నాయి. ఇవి కాకుండా రెండు ట్యూబ్‌లైట్లు ఉన్నాయి. ఆయన మార్చి నెలలో మొత్తం 154 యూనిట్ల విద్యుత్‌ను ఉపయోగించారు. దీనికి సంబంధించి వచ్చిన బిల్లు మొత్తం రూ.5,436. ఇందులో రూ.4,550లను పాత బకాయిలుగా చూపించారు. ట్రూ అప్ చార్జీలుగా (33/36) రూ.48.96, ఎఫ్‌పీపీసీఏ చార్జీలుగా(23/05) రూ.93.13, ఎఫ్‌పీపీసీఏ (25/02) చార్జీలుగా రూ.41.60 విధించారు. వినియోగించిన విద్యుత్ యూనిట్లకు రూ.591, ఫిక్స్‌డ్ చార్జీలుగా రూ.10లు, కస్టమర్ చార్జీలుగా రూ.50, విద్యుత్ సుంకం రూ.9.24లుగా చూపించారు.
- గుణదలకు చెందిన మరో వినియోగదారుడు 284 యూనిట్లను వినియోగించారు. ఆయనకు వచ్చిన మొత్తం బిల్లు రూ.1,533.25. ఈ విద్యుత్ బిల్లులను చూసి వినియోగదారులు గొల్లుమంటున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఇంట్లో స్విచ్ వేసినా, వేయకపోయినా కరెంట్ షాక్ తగులుతోంది. వినియోగించిన విద్యుత్ మూరెడు ఉంటే, వచ్చే బిల్లులు మాత్రం బారెడు ఉంటున్నాయి. కిందటి నెల వందల్లో వచ్చిన విద్యుత్ బిల్లులు ఇప్పుడు ఒక్కసారిగా వేలల్లోకి వెళ్లాయి. ట్రూప్ అప్ చార్జీలు, ఇంధనపు చార్జీలు, సర్దుబాటు చార్జీలతోపాటు అదనపు లోడ్ చార్జీలను విధిస్తున్నారు. దీనితో వినియోగదారులకు ఈ నెలలో చెల్లించాల్సిన బిల్లులు డబుల్ షాక్‌ను ఇస్తున్నాయి. ఇప్పటికే వివిధ రూపాల్లో విధిస్తున్న చార్జీలతో విద్యుత్ వినియోగదారులు ఉక్కిరిబిక్కిర వుతున్నారు. దీనికి అదనపు లోడ్ చార్జీలను జోడించడంతో తలలు పట్టుకుంటున్నారు. ఏం చేయాలో తెలియక అల్లాడిపోతున్నారు. ఇళ్లలో ఫ్యాన్‌లు వేయాలన్నా, ఏసీ ఆన్ చేయాలన్నా వినియోగదారులు బెంబేలెత్తి పోతున్నారు. గత నెలకు, ఈ నెలకు బిల్లులు తడిసి

మిగతా 6లో..

ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో నేలవాలిన బొప్పాయి తోట



అకాల వర్షం.. అపార నష్టం

15 వేల హెక్టార్లలో నేలరాలిన మామిడి

- 14.20 హెక్టార్లలో పడిపోయిన అరటి తోటలు
- 46 హెక్టార్లలో బొప్పాయి చెట్లు ధ్వంసం
- ఉద్యాన రైతులను కోలుకోలేని దెబ్బతీసిన గాలివాన

అకాల వర్షాలు రైతులకు అపార నష్టాన్ని కలుగుజేశాయి. వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు వచ్చిన ఈదురు గాలులతో కూడిన వర్షం ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 15 వేల హెక్టార్లలో మామిడి కాయలు నేలరాలాయి. 14.20 హెక్టార్లలో అరటి తోటలు, 3.5 హెక్టార్లలో మునగ, 46 హెక్టార్లలో బొప్పాయి తోటలు నేలమట్టం అయ్యాయి. 8.4హెక్టార్లతో కూరగాయలు పంటలు దెబ్బతిన్నాయి. అకాల వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి.

6లో





ఇక దేద్వీపం!

భవానీ ద్వీపం అభివృద్ధికి ముందుకొచ్చిన సీఆర్‌డీఏ

- ప్రభుత్వ ఆదేశాలతో లేఖ రాసిన బీఐటీసీ
- అమరావతి రాజధాని పరిధిలో ఉండటంతో మరింత అభివృద్ధికి అవకాశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి రాజధాని నగరానికి అభిముఖంగా ఉన్న భవానీ ద్వీపాన్ని ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి సీఆర్‌డీఏ ముందుకు ముందుకు వచ్చింది. కృష్ణానదిలో అతి పెద్ద ఏకైక ద్వీపంగా భవానీ ఐల్యాండ్ ఉంది. తరచూ వస్తున్న వరదలు భవానీ ఐల్యాండ్‌ను కోలుకోలేకుండా చేస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భవానీ ద్వీపాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేశారు. అనూహ్యంగా ఆ తర్వాత వచ్చిన వరదలు నాశనం చేశాయి. దీంతో వరదలను తట్టుకునేలా తీర్చిదిద్దటంతో పాటు, దీని అభివృద్ధి బాధ్యతలను ఇక మీదట సీఆర్‌డీఏ తీసుకోబోతోంది. భవానీ ద్వీపం చుట్టూ రక్షణ కవచం ఏర్పాటు చేయటంతో పాటు లోపల పర్యాటకంగా అభివృద్ధి చేయనుంది. భవానీ ద్వీపం అభివృద్ధి కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం భవానీ ఐల్యాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ)ని ఏర్పాటు చేసింది. ఈ బీఐటీసీ ద్వారా ద్వీపంలో గతంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టడం జరిగింది. ప్రస్తుతం బీఐటీసీ కూడా నిధుల కొరతను ఎదుర్కొంటోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం భవానీ ద్వీపం అభివృద్ధిలో సీఆర్‌డీఏ కూడా భాగస్వామ్యం కావాలని

మిగతా 6లో..

మునేటిపై వంతెన!

ఏటూరు, మోగులూరు మధ్య నిర్మాణానికి అనుకూలం

వంతెనలు, రహదారుల నిర్మాణం ఎక్కడ జరిగితే అక్కడ అభివృద్ధి జరుగుతుంది. వ్యవసాయ, వాణిజ్య, రవాణా రంగాలలో పెను మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా పెరుగుతాయి. మౌలిక వసతులలో ప్రధానమైన రోడ్లు, వంతెనల నిర్మాణం వల్ల నేడు అనేక నగరాలు అభివృద్ధిని సాధించాయి. అదే తీరున రహదారి సౌకర్యాలు పెరిగితే గ్రామీణ ప్రాంతాలు సైతం అభివృద్ధి వైపు అడుగులు వేస్తాయి. అమరావతి నిర్మాణంతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వం తొలుత రోడ్లు, వంతెనలపైనే దృష్టి సారించింది. కృష్ణానదిపై వంతెనల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. దీంతో సుదీర్ఘ కాలంగా ఉన్న మునేటిపై ఏటూరు-మోగులూరు వంతెన నిర్మాణం డిమాండ్ తెరపైకి వచ్చింది.


మునేటిలో నీటి ప్రవాహం

- కాజ్‌వే నిర్మాణానికి స్థానిక నాయకుల వినతి
- రూ.2.20 కోట్లు ఇస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటన
- రూ.145 కోట్ల అంచనాలతో వంతెన నిర్మాణానికి డీపీఆర్ ఇచ్చిన ఆర్‌అండ్‌బీ అధికారులు
- నిధుల మంజూరుకు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి
- కాజ్‌వే కావాలో.. వంతెన కావాలో తేల్చుకోవాల్సింది స్థానిక నాయకులే..


మునేటిపై వంతెన నిర్మాణం చేపట్టాల్సిన ప్రదేశం

చందర్లపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చందర్లపాడు-కంచికచర్ల మండలాలను కలుపుతూ మునేటిపై కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని ప్రజలు దశాబ్దాలుగా కోరుతున్నారు. చందర్లపాడు మండలం ఏటూరు నుంచి కంచికచర్ల మండలం మోగులూరు మధ్య ఈ నిర్మాణం చేపట్టాలన్నది ప్రజల కోరిక. గత తెలుగుదేశం ప్రభుత్వంలో కాజ్‌వే నిర్మాణానికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు సర్వే కూడా నిర్వహించారు. ఈ నిర్మాణం జరిగితే రెండు మండలాల మధ్య సుమారు 30 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ప్రజలకు ఎంతో సౌకర్యం ఏర్పడుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా ఖర్చులు తగ్గుతాయి. దీంతో పాటు చందర్లపాడు మండల ప్రజలు రాజధాని అమరావతికి వెళ్లాలంటే అత్యంత సులువైన మార్గం ఏర్పడుతుంది. ఈ వంతెన దాటితే ఓఆర్‌ఆర్‌ను త్వరగా చేరుకోగలుగుతారు. ఇన్ని ప్రయోజనాలు ఉన్న ఈ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కాజ్‌వేనా.. వంతెనా!

మునేటిపై కాజ్‌వే నిర్మిస్తారా లేక వంతెన నిర్మాణం చేపడతారా అన్న అంశంపై ప్రజల్లో సందిగ్ధత నెలకొంది. వర్షాకాలంలో మునేటి ప్రవాహం ఉధృతంగా ఉంటుంది. ఏటూరు- మోగులూరు వద్ద మునేటి ప్రవాహం కృష్ణానదిలో కలుస్తుంది. ఏటా ఏదో ఒక సమయంలో రెండు నదులకు ఒకే మారు ప్రవాహం పెరుగు తుంది. ఆ దశలో మునేరు ఎగతాపు వేసి

మిగతా 6లో..

దుర్గగుడిలో చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

6లో

త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

- సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- కడపలో జరిగే మహానాడుకు తరలిరండి
- మంత్రి కొల్లు రవీంద్ర

6లో

సిట్ విచారణలో అన్నీ తేలతాయి

- అవినీతి ఊబిలో కూరుకుపోయిన పేర్ని నానికి మతిభ్రమించింది
- నాణ్యత పరీక్షించాకే మద్యం విక్రయిస్తున్నాం
- పేర్ని నాని వ్యాఖ్యలకు మంత్రి రవీంద్ర కౌంటర్

6లో



విరిగి పడిన పనస చెట్లు, నేలరాలిన పండ్లు చూపుతున్న రైతు



కొత్తూరు తాడేపల్లిలో నేలరాలిన మామిడి



కొర్లమండలో విరిగి పడిన మామిడి చెట్టు



జి.కొండూరులో కల్లాల్లో మిర్చిపై పట్టాలు కప్పుతున్న రైతులు

అకాల వర్షం.. అపార నష్టం!

- రెండ్రోజులు వర్షం, ఈదురు గాలుల విధ్వంసం
- ఉద్యాన రైతుకు కోలుకోలేని దెబ్బ
- ఎన్టీఆర్ జిల్లాలో 15 వేల ఎకరాల్లో రాలిన మామిడి కాయలు.. కల్లాల్లో తడిసిన మిర్చి.. మధ్యకు విరిగి పడిన బొప్పాయి చెట్లు

అకాల వర్షాలు అన్నదాతకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం ఉద్యాన రైతుల నడ్డి విరిచింది. ఒకవైపు తెగుళ్ల బెడదతో అల్లాడుతున్న రైతులు అధిక పెట్టుబడులు పెట్టి ఎలాగోలా పంటను దక్కించుకున్నా గిట్టుబాటు ధరలేక దిగాలు పడుతున్న దశలో అకాల వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి. ముఖ్యంగా ఉద్యాన పంటల రైతులు భారీగా నష్టపోయారు.

(ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి)

అకాల వర్షాలు.. ఈదురు గాలులు మిర్చి, మామిడి, బొప్పాయి, పనస తదితర ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. ఏప్రిల్ 7న ఈదురుగాలులకు కల్లాల్లో మిర్చిని కాపాడుకునేందుకు కప్పిన పట్టాలు గాల్లో ఎగిరి కిలోమీటర్ దూరంలో పడ్డాయి. దీంతో మిర్చి తడిచి ముద్దయింది. మిర్చి తడిచి పోవడంతో కాయలు రంగు మారుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మామిడికి అపారనష్టం

అకాల వర్షాలు పంట చేతికి రాకుండానే మామిడి రైతుకు తీవ్ర నష్టం మిగిల్చాయి. ఎన్టీఆర్ జిల్లాలో విస్సన్నపేట, రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు, విజయవాడ రూరల్ మండలాల్లోని తోటల్లో కాయలు నేలరాలగా.. చెట్లు నిలువునా చీలిపోయాయి. చాలాచోట్ల పెద్ద పెద్ద చెట్లు నేలకూలాయి. జిల్లాలోని 55 వేల ఎకరాలకు 20 వేల ఎకరాల్లోని తోటల్లో మామిడికాయలు నేలరాలాయి. రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. రెండుసార్లు ఈదురుగాలులకు కాయలు పూర్తిగా నేలరాలి కోతలు కోసిన తోటల్లా మారడంతో కొత్తూరుతాడేపల్లి, జి.కొండూరు, రెడ్డిగూడెం, విస్సన్నపేట, మైలవరం రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఎంతో ఖర్చుచేసి పండించిన పంట ఈదురుగాలులకు పూర్తిగా నాశనమైందని, తాము నష్టపోయామని, ఉద్యానశాఖ అధికారులు స్పందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. కొత్తూరు తాడేపల్లిలో నేలవాలిన మామిడితోటలను టీడీపీ మైలవరం నియోజకవర్గ ఎస్సీసెల్ సెక్రటరీ మెండెం జమలయ్య, రైతు నాయకులు చింతా సుధాకర్, వార్డు సభ్యుడు సింహాద్రి రామోజీ పరిశీలించి రైతులను పరామర్శించారు.

● ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన రైతు తుల్లూరు గోపాలరావు సుమారు ఐదు ఎకరాల్లో బొప్పాయి సాగుచేయగా.. ఈదురు గాలులకు సుమారు మూడు ఎకరాల్లో తోట పూర్తిగా నేలవాలిపోయింది. కాయలు కోసేందుకు పనికి రావని రైతు వాపోయాడు. ఎ.కొండూరు మండలంలో 40 హెక్టార్లలో బొప్పాయి సాగుచేయగా 18 హెక్టార్లలో పంట నేలవాలినట్టు హెచ్‌వో నరేంద్రకుమార్ తెలిపారు.

ఆందోళనలో మామిడి, మొక్కజొన్న రైతులు

మైలవరంరూరల్/జి.కొండూరు : ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో మండలంలోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వందల టన్నుల మామిడి కాయలు నేలరాలాయి. కాయ కోతకు వచ్చిన సమయంలో అకాల వర్షంతో లక్షలాది రూపాయలు నష్టపోయామని రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. మంగళవారం ఉదయం వ్యాపారులు కూలీలతో నేలరాలిన కాయలను కుప్పలుగా పోయించారు. పొందుగల తండా సమీపంలోని కాకర తోట ఈదురుగాలులకు నేలమట్టం అయ్యింది. చంద్రగూడెం లక్ష్మీనరసింహస్వామి ధ్వజ స్తంభం విరిగిపడింది. తోటల్లో కొమ్మలు విరిగిపోయాయి. పొందుగల, అనంతవరం, చంద్రగూడెం, తదితర గ్రామాల్లో మొక్కజొన్న నేలవాలింది. కంకి విరుపుకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్నకు ఈదురు గాలులు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. కంకిబరువుతో ఉన్న తోటలు నేలవాలిపోయాయి. ఇప్పటికే కండెలు విరిసి ఆరబోసిన మొక్కజొన్నలు అకాల వర్షానికి చాలా వరకు తడిచి ముద్దయ్యాయి. ఇప్పటికే నష్టాలలో ఉన్న తమను అకాల వర్షం మరింత దెబ్బతీసిందని రైతులు వాపోతున్నారు.



నేలవాలిన మొక్కజొన్న, తలలు విరిగిన బొప్పాయి తోటలు



కూలిన చెట్లు.. పడిపోయిన విద్యుత్ స్తంభాలు

జి.కొండూరు : ఈదురు గాలులకు విద్యుత్‌శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. జి.కొండూరు నుంచి వెలగలేరు పేదల కాలనీకి వెళుతున్న విద్యుత్‌లైన్లపై ఆత్కూరు రోడ్డు వెంట ఉన్న చెట్లు పలు చోట్ల విరిగి పడ్డాయి. దీంతో సుమారు 10పైగా విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. సుమారు 2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.



ప్రభుత్వం ఆదుకోవాలి



- పలగాని చెన్నకేశవరావు

ఇప్పటికి రెండు సార్లు కురిసిన వర్షానికి పంటలు పూర్తిగా తడిచిపోయాయి. గిట్టుబాటు ధర లేదు. పంట నష్టంపై అధికారులు స్పందించాలి. ప్రభుత్వం ఆదుకోవాలి.

ఆరుగాలం కష్టం నీటిపాలు



- కందుల ప్రభాకర్ (జి.కొండూరు)

వర్షం నుంచి కల్లాల్లో మిర్చి పంటను కాపాడుకునేందుకు పట్టాలు కప్పినా ప్రయోజనం లేదు. ఈదురుగాలులకు పట్టాలు ఎగిరిపోయాయి. వర్షానికి మిరపకాయలు తడిచి రంగు మారిపోతున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి లేకుంటే ఆత్మహత్యలే శరణ్యం.

కన్నీరే మిగిలింది..



- పగడాల సత్యనారాయణ (నాగులూరు)

ఈదురు గాలులకు మామిడికాయలు పూర్తిగా రాలిపోయాయి. తోటలోకి వెళితే కళ్ల వెంట నీళ్లు వస్తున్నాయి. కిందపడిన కాయలు వేరించినా ఫలితం శూన్యం. అసలే తెగుళ్లకు మందులు వాడి పంట పండించాం. ఇప్పుడు అంతా వర్షార్పణం అయ్యింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

పంట నష్టం అంచనాలు వేశాం

- బాలాజీ, ఏడీహెచ్

ఎన్టీఆర్ జిల్లాలో సోమవారం ఈదురుగాలులు, వర్షాలకు ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. 14.20 హెక్టార్లలో అరటి తోటలు, 3.5 హెక్టార్లలో మునగ, 46 హెక్టార్లలో బొప్పాయి తోటలు, 8.4 హెక్టార్లతో కూరగాయలు పంటలు దెబ్బతిన్నాయి. 15 వేల హెక్టార్లలో మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి.



చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాల పూజలు, వెండి పల్లకీ సేవ

దుర్గగుడిలో చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో మంగళవారం చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన మంగళవారం దుర్గా మల్లేశ్వరులకు మంగళస్నానాల అనంతరం వధూవరులుగా అలంకరించారు. సాయంత్రం 4 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, అఖండ దీప స్థాపన, కలశారాధన, బలిహరణ, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు వేదోక్తంగా జరిగాయి. సాయంత్రం 5 గంటలకు తప్పెట్లు, కోలాట నృత్యాలు, తాళం, భజన కళాకారుల ప్రదర్శనలు, వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దుర్గా మల్లేశ్వరుల వెండి పల్లకీ వాహన సేవ కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, కొత్తపేట, మెయిన్ బజారులలో భక్తకోటిని అనుగ్రహిస్తూ ఊరేగింపు సాగింది. పల్లకి ముందు భక్తులు రహదారులను పసుపు నీళ్లతో శుద్ధి చేసి, హారతులు, కొబ్బరికాయలు సమర్పించి జయజయ ధ్వానాలుచేశారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

- సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- కడపలో జరిగే మహానాడుకు తరలిరండి
- మచిలీపట్నంలో జిల్లా స్థాయి మహానాడు
- రెండెకరాల్లో పార్టీ కార్యాలయం ఏర్పాటు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : త్వరలో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో రవీంద్ర మాట్లాడారు. కుటుంబ సాధికార సారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. త్వరలో గ్రామ, అనుబంధ, జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తామని, అనంతరం మే 27, 28, 29 తేదీల్లో రాష్ట్ర కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. మచిలీపట్నంలో రెండెకరాల్లో పార్టీ కార్యాలయం ఏడాదిలోగా పూర్తి చేస్తామన్నారు. ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. గ్రామ స్థాయిలో పనితీరును పరిశీలిస్తున్నారన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకే నామినేటెడ్ పదవులు దక్కుతాయన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, మచిలీపట్నంలో జిల్లా స్థాయి మహానాడు నిర్వహణకు అందరూ ముందుకురావాలన్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, కృష్ణా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో అక్రమాలపై విచారణ జరిపించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార శాఖా మంత్రిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పింగళి వెంకయ్య, భోగరాజు పట్టాభి సీతారామయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు, ఎన్టీఆర్ వంటి మహనీయుల విగ్రహాలను మచిలీపట్నంలో నెలకొల్పాలన్నారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ, రూ. 80 కోట్ల వ్యయంతో పామర్రు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య మరింత సమన్వయం అవసరమన్నారు. కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, కొనకళ్ల బుల్లయ్య, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, గొట్టిపాటి వెంకట్రావు, తలశిల స్వర్ణలత, మోటమర్రి బాబాప్రసాద్, గోపు సత్యనారాయణ, బత్తిన దాసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, పక్కన ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, కొనకళ్ల నారాయణ తదితరులు

సిట్ విచారణలో అన్నీ తేలతాయి

- అవినీతి ఊబిలో కూరుకుపోయిన పేర్ని నానికి మతి భ్రమించింది
- నాణ్యత పరీక్షించాకే మద్యం విక్రయిస్తున్నాం
- పేర్ని నాని వ్యాఖ్యలకు మంత్రి రవీంద్ర కౌంటర్

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మద్యం అక్రమాలపై సిట్ విచారణ జరుపుతుంటే.. పేదల బియ్యం దొంగ పేర్నినాని మతి భ్రమించి మాట్లాడుతున్నాడని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. పేర్నినాని విమర్శలపై మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి రవీంద్ర మాట్లాడారు. మాజీమంత్రి పేర్ని నాని విమర్శలను తిప్పికొట్టారు. వైసీపీ నేతల్లా కల్తీ మద్యాన్ని ఎన్నడూ విక్రయించలేదన్నారు. మద్యం దుకాణాలనుంచి కూటమి ఎమ్మెల్యేలు మామూళ్లు వసూలు చేస్తున్నారన్న పేర్ని నాని ఆరోపణలను మంత్రి ఖండించారు. మద్యం విధానంలో అవినీతికి పాల్పడింది వైసీపీ ప్రభుత్వమే అన్నారు. ప్రభుత్వ మద్యం పేరుతో జేబులు నింపుకున్నారన్నారు. వైసీపీ అక్రమాలపై సీఐడీ, సిట్ విచారణ జరుగుతోందన్నారు. ఏ తప్పు చేయక పోతే ఫైళ్లను ఎందుకు తగుల పెడతారన్నారు. బెల్ట్ షాపులకు వేలం పెట్టి పెద్ద ఎత్తున డబ్బు దోచుకున్నారన్నారు. గీత కార్మికులకు 340 షాపులు కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో మద్యం నిల్వల శాంపిళ్లను పరీక్ష చేయిస్తున్నామన్నారు. పేదల బియ్యం బొక్కి మీడియా ఎదుట పేర్ని నాని నీతులు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు.



వేసవి ప్రత్యేక రైళ్లు

రైల్వే స్టేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు విజయవాడ డివిజన్ మీదుగా 16 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం మండ్రూపకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07325 హుబ్లీ-కతిహార్ ఈనెల 9 నుంచి 30వ తేదీవరకు ప్రతి బుధవారం, 07326 కతిహార్-హుబ్లీ ఈనెల 12 నుంచి మే 3వ తేదీ వరకు ప్రతి శనివారం, 06559 ఎస్ఎంబీటి బెంగుళూరు-నారంగి ఈనెల 8 నుంచి 29వ తేదీ వరకు ప్రతి మంగళవారం, 06560 నారంగి-ఎస్ఎంబీటి బెంగుళూరు ఈనెల 12 నుంచి మే 3వ తేదీ వరకు ప్రతి శనివారం నడుస్తాయన్నారు. ఈ ప్రత్యేక రైళ్లలో టూఏసీ, త్రీఏసీ, స్లీపర్, జనరల్, సెకండ్ కోచ్‌ల సౌకర్యం ఉంటుందని చెప్పారు.

ఇక దేద్వీపం!

(5వ పేజీ తరువాయి)

ఆదేశించటంతో.. సీఆర్‌డీఏ భవానీ ద్వీపం బాధ్యతలను తీసుకోవాలని నిర్ణయించింది. భవానీ ద్వీపం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బీఐటీసీ ఉన్నతాధికారులు కూడా సీఆర్‌డీఏకు ఆ మేరకు లేఖ రాయటం జరిగింది. వెంటనే సీఆర్‌డీఏ కూడా సానుకూలంగా స్పందించింది. బీఐటీసీ నేతృత్వంలో చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టులకు సీఆర్‌డీఏ ఆర్థికంగా తన వంతు సహకారాన్ని ఇక మీదట అందించనుంది. రాజధాని ప్రాంత పరిధిలో భవానీ ద్వీపం ఉండటం వల్ల సీఆర్‌డీఏ రంగంలోకి దిగటం వల్ల రానున్న రోజుల్లో భవానీ ద్వీపం అత్యద్భుతంగా అభివృద్ధి చెందటానికి అవకాశం కలగనుంది.

అభివృద్ధికి చేయూతనివ్వండి

- కార్పొరేట్‌సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కార్పొరేట్ సంస్థలు తమవంతుగా చేయూతను అందించాలని కృష్ణా కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో అంగన్వాడీకేంద్రాల భవనాలు నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయాయని, వాటిని తిరిగి పూర్తిచేసేందుకు సంస్థలు తమ సీఎస్ఆర్ నిధులను విడుదల చేయాలని సూచించారు. దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, ఊతకర్రలు, లాప్‌ట్యాప్‌లు, అందజేయాల్సి ఉందని, మొవ్వ డిగ్రీకళాశాల, గుడివాడ ఐటీఐలలో కంప్యూటర్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉందని, జిల్లాలో కోల్డ్‌స్టోరేజీ భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో బెల్‌కంపెనీ డీజీఎం ఫణికుమార్, మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి సమన్వయకర్త ఆశాలత, నాబార్డ్ రాష్ట్రసమన్వయకర్త మహేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులందరినీ ఆరోగ్య పథకంలో చేర్చాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ ఆరోగ్యపథకంలో ఉద్యోగులందరినీ చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎన్టీఆర్ వైద్యసేవల బృందం, కలెక్టరేట్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులను ఎన్టీఆర్ ఆరోగ్య పథకంలో చేర్చేందుకు ఇబ్బందులు ఉంటే వాటిని సరిచేసేందుకు మార్గాలను కనుగొనాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఆరోగ్యపథకం ద్వారా ప్రయోజనం పొందలేక ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. వివిధ విభాగాల్లో అన్నిస్థాయిల్లో పనిచేసే ఉద్యోగులంతా ఎన్టీఆర్ వైద్యఆరోగ్య పథకంలో చేరి, సంబంధిత కార్డులను పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులు ఆరోగ్యపథకంలో తమపేర్లను నమోదు చేసుకునేందుకు ప్రత్యేకంగా ఒకరోజును కేటాయించాలని సూచించారు. ఇప్పటికే ఆరోగ్యపరమైన సేవలు పొంది, బిల్లులు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులను గుర్తించి, వారికి బిల్లులను మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పింఛనుదారుల సమస్యలను పరిష్కరించేందుకు సరైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఎన్టీఆర్ వైద్యసేవల ఈహెచ్ఎస్ విభాగం జేఈవో డాక్టర్ సుశీల, డెప్యూటీ ఈవో కల్పవల్లి, ఆరోగ్యశ్రీ విభాగం జిల్లాసమన్వకర్త డాక్టర్ సతీష్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.



బిల్లు.. గొల్లు!

(5వ పేజీ తరువాయి)

మోపిడయ్యాయి. ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలు, కస్టమర్ చార్జీల పేరుతో బిల్లులు పెరగడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. గత నెలకంటే చార్జీలు రెట్టింపు కావడంతో వినియోగదారులు విద్యుత్ శాఖఅధికారులపై మండిపడుతున్నారు. కరెంటు చార్జీలు పెంచబోమని ప్రభుత్వం చెబుతుంటే బిల్లులు మోత మోగించడం ఏమిటని వినియోగదారులు నిలదీస్తున్నారు. రెట్టింపు బిల్లులు వచ్చాయని వారు ఆందోళన చెందుతున్నారు.

పాత బకాయిలుగా అదనపు లోడ్ చార్జీలు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎల్‌టీ-1(గృహ) కనెక్షన్లు 14,98,644, ఎల్‌టీ-2(వాణిజ్యం) కనెక్షన్లు 1,19,874 ఉన్నాయి. ఇవి కాకుండా ఎల్‌టీ-3(పరిశ్రమలు) కనెక్షన్లు 7,198, ఎల్‌టీ-4(కుటీర పరిశ్రమలు) కనెక్షన్లు 27,786, ఎల్‌టీ-5 (ఆక్వా) 3 వేలు, హెచ్‌టీ కనెక్షన్లు 1,522 ఉన్నాయి. ఈ మొత్తం కనెక్షన్లకు ఏడు రకాలుగా చార్జీలను విధిస్తున్నారు. వీటితోపాటు అదనపు లోడ్ చార్జీలను బిల్లులో విధిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ తీసుకునేటప్పుడు ఎంత వరకు లోడ్ వినియోగిస్తారో దరఖాస్తులో తెలియజేయాల్సి ఉంటుంది. కొద్దినెలల క్రితం విద్యుత్‌శాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి లోడ్‌ను తనిఖీ చేశారు. దరఖాస్తులో పేర్కొన్న లోడ్‌కు మించి విద్యుత్‌ను వినియోగిస్తున్నారని నోటీసులు జారీ చేశారు. ఎంత లోడ్ అదనంగా వినియోగిస్తున్నారో దానికి చెల్లించాల్సిన మొత్తాలను రాసి ఇచ్చారు. ఈ నోటీసులకు వినియోగదారులు పెద్దగా స్పందించలేదు. దీనితో బిల్లులో వాటిని చూపిస్తున్నారు. వాటిని పాత బకాయిలుగా బిల్లులో పేర్కొన్నారు. ఆ బకాయిలను పదో తేదీ లోగా చెల్లించాలని విద్యుత్ శాఖ సిబ్బంది చెబుతున్నారు. వినియోగదారులు విద్యుత్ కార్యాలయాలకు వెళ్లి సందేహాలను వ్యక్తం చేసిన తర్వాత ఈ విషయాన్ని చెబుతుండడం గమనార్హం.

నోటీసులు ఎప్పుడిచ్చారో తెలియదు

నేను అద్దె ఇంట్లో ఉంటున్నా. ప్రతినెలా బిల్లు చెల్లిస్తున్నా. నాకు ఈ నెల బిల్లు రూ.591 వచ్చింది. ఎరియర్స్ (పాతబకాయిలు)గా రూ.4,550 చూపించారు. బిల్లు ఇవ్వగానే సంబంధిత విద్యుత్ కార్యాలయానికి వెళ్లా. ఇదేమిటని అడిగితే అదనపు లోడ్‌చార్జీలని చెప్పారు. వాటిని పదో తేదీ లోగా చెల్లించాలని చెబుతున్నారు. లేకపోతే ఈ చార్జీలు ఇంకా పెరుగుతాయని అధికారులు అంటున్నారు. ఇదెక్కడి దారుణమో అర్థం కావడం లేదు. ఇప్పటికే ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలతో మాపై భారం పడుతుంది.

మునేటిపై వంతెన!

(5వ పేజీ తరువాయి)

గ్రామాల్లోకి సైతం నీరు చేరుతుంది. ఆ సమయంలో కాజ్‌వే ఉన్నా ఉపయోగం ఉండదు. వర్షాకాలంలో తరచూ ఈ పరిస్థితి కొనసాగుతుంది. దీంతో కాజ్‌వే నిర్మాణం కాకుండా వంతెన నిర్మాణం చేపట్టాలన్న అభ్యర్థన తెరపైకి వచ్చింది. ఈ మేరకు మరోమారు సర్వే నిర్వహించిన ఆర్అండ్‌బీ అధికారులు మొత్తం 810 మీటర్ల వంతెన నిర్మాణంతో పాటు రెండు వైపులా అర కిలోమీటరు చొప్పున అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ.145 కోట్లతో అంచనాలు రూపొందించారు.ఈ మేరకు ముప్పాళ్ల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు డీపీఆర్‌ను అందించారు. ఈ వంతెన నిర్మాణం వల్ల ప్రజలకు జరిగే మేలును ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి తక్షణమే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

స్థానిక నాయకుల్లో స్పష్టత అవసరం

ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేసిన వినతిలో రూ.145 కోట్లతో వంతెన నిర్మాణం డీపీఆర్ నివేదిక ఉన్నట్టు సమాచారం. కానీ నాయకుల ప్రసంగాలు, వినతుల్లో కాజ్‌వే కావాలని మాత్రమే కోరారు. ముఖ్యమంత్రి కూడా రూ.2.20 కోట్లతో కాజ్‌వే నిర్మాణానికి నిధులు ఇస్తానని ప్రకటించారు. వాస్తవానికి కాజ్‌వే నిర్మించాలన్నా ముఖ్యమంత్రి ప్రకటించిన నిధులు సరిపోవు. స్థానిక నాయకులు తమ కోరికను స్పష్టంగా ముఖ్యమంత్రికి చెప్పలేకపోవడం వల్ల ఈ పరిణామలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా స్థానిక నాయకులు, అధికారులు తమకు కావల్సింది కాజ్‌వేనా లేక వంతెనా అన్న స్పష్టతకు రావాల్సి ఉంది. అందుకు అయ్యే ఖర్చు అంచనాలను కూడా ముఖ్యమంత్రికి స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ నిర్మాణం చేపట్టడానికి ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్న వేళ అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

పోషణ పక్వాడ పక్షోత్సవాలు ప్రారంభం

కంకిపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు ఐసీడీఎస్ పరిధిలో పోషణ పక్వాడ పక్షోత్సవాలను, తహసీల్దార్ గోపాలకృష్ణ, సీడీపీఓ బేబీ సుకన్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంకిపాడు, వణుకూరులో అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి, పిల్లల పెరుగుదలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణభవాని, ఆర్ఐ భరద్వాజ్, పి నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె శ్రీలత అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కంకిపాడులో పోషణ పక్వాడ పక్షోత్సవ ర్యాలీ

వ్యర్థాల దహనం అనర్థం!

- కలియదున్నడమే మేలు
- అవగాహనా లోపంతో పంట వ్యర్థాలు తగలబెడుతున్న రైతులు
- భూసారం తగ్గిపోతుందంటున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు



తరిగొప్పలలో తగలబెడుతున్న పంట వ్యర్థాలు

(ఉంగుటూరు - ఆంధ్రజ్యోతి)

రబీ వ్యవసాయ సీజన్ ముగియడంతో పొలాల్లో మిగిలిపోయిన వరి, మినుము, పెసర పంటల అవశేషాలు, వ్యర్థాలను రైతులు తగలబెడుతున్నారు. జూన్ నుంచి ఖరీఫ్ (సార్వా) వ్యవసాయ సీజన్ ప్రారంభమౌతున్న నేపథ్యంలో బోర్లు, చెరువులకింద సాగుచేసే పొలాల్లో ఇప్పటికే రైతులు దుక్కిదున్నే పనులు చేపట్టారు. కాగా కాలువ కింద పొలాల్లో సాగు పనులు చేపట్టేందుకు అడ్డంకిగా వున్న పంటల అవశేషాలు, పిచ్చిమొక్కలను తొలగించటంకన్నా, దహనం చేయటమే మేలనుకున్న రైతులు కాల్చివేత ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. దీంతో ఒకరైతును చూసి మరొక రైతు వరుసగా పంట వ్యర్థాలను దగ్ధం చేస్తున్నారు. పంట అవశేషాల దహనంతో వెలువడుతున్న పొగ చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోడ్ల పక్కన పొలాల్లో తగలబడుతున్న పంట వ్యర్థాల నుంచి వచ్చే పొగతో ఆమార్గంలో ప్రయాణించే వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పొలాల్లో జరిగే ఈ దహనకాండను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు అనర్థదాయకం

పంటల అవశేషాలను దహనం చేయడం రైతులకు అనర్థదాయకమని మండల వ్యవసాయాధికారి వీవీఎస్ఆర్ఎస్ హరీష్‌కుమార్ తెలిపారు. పొలాల్లో మిగిలిపోయిన పంటఅవశేషాలను కాల్చడం వల్ల భూమిపై పొరల్లో వుండే సూక్ష్మపోషకాలకు నష్టం వాటిల్లి భూసారం తగ్గిపోతుందన్నారు. వ్యర్థాల దహనంతో వెలువడే పొగ వల్ల వాయు కాలుష్యం పెరిగి పర్యావరణానికి, నేలకు హాని కలుగుతుందని హెచ్చరించారు. పంటల వ్యర్థాలను చేనంతా పరిచి తొలకరి వర్షాలు పడిన వెంటనే నేలలో కలియదున్నడం వల్ల వేసే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న పోరంకి రామాపురం కాలనీవాసులు

తాగునీటి పైపులకు మరమ్మతులు చేపట్టాలి

కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన పోరంకి రామాపురం కాలనీ వాసులు

పెనమలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తమ కాలనీకి వచ్చే తాగునీటి పైపుల నుంచి నీరు సక్రమంగా రావడం లేదని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ పోరంకి రామాపురం కాలనీవాసులు తాడిగడప మునిసిపల్ కమిషనర్ భవానీప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. షుమారు 30 ఏళ్ల క్రితం ఏర్పడిన తమ కాలనీలోని 127 ఇళ్లలో షుమారు ఐదు వందల మంది నివాసముంటున్నారని, తమ కాలనీకి వచ్చే అరకొర నీటితో ఇబ్బందులు పడుతున్నామని వినతిపత్రంలో వాపోయారు. నీటి పైపుల్లో నాచు, పాచి పేరుకుపోయి ఉండవచ్చని, వాటిని తొలిగింపజేసి నీటి సరఫరాను సరిచేయాలని కోరారు. కాలనీ వాసులంతా సకాలంలో ఇంటి, నీటి పన్నులను చెల్లిస్తున్నామని ఇటీవల మునిసిపల్ సిబ్బంది డిమాండ్ చేసిన రూ. 4800ల నీటిపన్నులను చెల్లించామని తెలిపారు.

మట్టి నమూనాల సేకరణపై అవగాహన



రైతులతో మాట్లాడుతున్న ఏవో శైలజ

పెనమలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మట్టి నమూనాల పరీక్షలతో రైతుల పొలాల్లో పోషక విలువలు తెలుస్తాయని మండల వ్యవసాయశాఖాధికారిణి శైలజ తెలిపారు. పెనమలూరు రైతు సేవా కేంద్రంలో మంగళవారం జరిగిన రైతు అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏఓ మాట్లాడుతూ పోషకాల స్థాయిలను బట్టి సాయిల్ హెల్త్ కార్డులను రైతులకు అందజేస్తామని తెలిపారు. హెల్త్ కార్డుల ద్వారా పొలాల్లోని సారాన్ని బట్టి పంటలకు కావలసిన పోషక అవసరాలను తమ సిబ్బంది రైతులకు తెలియజేస్తారన్నారు. మండలంలో పొలాల్లోని 338 శాంపిల్స్ మట్టి నమూనాలను త్వరలో సేకరించడం జరుగుతుందని తెలిపారు.



ఆగిరిపల్లి వద్ద గల మెట్ల కోనేరు చెరువులో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎన్ఎస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ

సాగర్‌జలాల విడుదల పొడిగించాలి

ఎన్ఎస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ ఎడమ కాలువ 3వజోన్ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చెరువులను నింపేందుకు ఏప్రిల్ 20 వరకూ సాగర్ జలాల విడుదలను పొడిగించాలని ఎనెస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ కోరారు. నూజివీడు మేజర్ ద్వారా విడుదలవుతున్న సాగర్ జలా లను డీసీ చైర్మన్లు, నీటి సంఘాల అధ్యక్షులు, సర్పంచ్‌లతో కలిసి మంగళవారం ఈదర వద్ద, మల్లబోయినపల్లి వద్ద పరిశీలించారు. ఆగిరిపల్లి వద్ద గల మెట్ల కోనేరు చెరువుకు తాగునీటి కోసం నింపుతున్న సాగర్ జలాలలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ ఉప్పు వెంకటేశ్వరరావు, నీటి సంఘ అధ్యక్షులు పల్లగాని నాగేంద్రరావు, తమ్మిశెట్టి రాంబాబు, శోభనాపురం సర్పంచ్ నక్కబోయిన వేణు, ఆగిరిపల్లి సర్పంచ్ చౌటపల్లి లక్ష్మీవిక్టర్ బాబు, ఆయుకట్టుదారులు పామర్తి నరసింహా రావు, నలజాల హరిబాబు, ముల్లంగా శ్రావణ్‌కుమార్, పానుగంటి గోపి, ఎస్. బాబు, ఎనెస్పీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు పర్యవేక్షణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వ్రతం ఆచరించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు అరుణ దంపతులు పూజా సామగ్రిని అందజేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

అమలుకాని జీవోపై నివేదికివ్వండి: లోకాయుక్త

ఉయ్యూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీలో ఇంటి పన్నుల సేవల విభాగంలో 198 జీవో అమలు కాని విషయమై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌ను రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి రజని నివేదిక కోరినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. మున్సిపల్ సేవల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబరు 198ను నగర పంచాయతీలో అమలు చేయని విషయమై ఫిబ్రవరి 2న రాష్ట్రలోకాయుక్తకు తాను చేసిన ఫిర్యాదు మేరకు నివేదిక కోరినట్టు తెలిపారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రసాదంపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రామవరప్పాడు సచివాలయంలో కార్పొరేషన్ రుణాలకు మంగళవారం ఇంటర్వ్యూ నిర్వహించారు. బీసీ, కాపు, కమ్మ, రెడ్డి, క్షత్రియ, మేదర, కుమ్మరి, ఈబీసీ కార్పొరేషన్లకు దరఖాస్తు చేసిన లబ్ధిదారులు హాజరైయ్యారు. దరఖాస్తుదారులకు బ్యాంకు మేనేజర్లు, సెలక్షన్ కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించారు. విజయవాడ రూరల్ మండల ఎంపీడీవో మురళీకృష్ణ, రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహన్, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

ఉంగుటూరు : బీసీ, ఇతర కార్పొరేషన్ల సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఉంగుటూరు మండల కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిధిలోని 27గ్రామాల నుంచి మొత్తం 546మంది అభ్యర్థులు బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకోగా తొలిరోజు 15గ్రామాలకు చెందిన 290మంది దరఖాస్తుదారుల్లో 241మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కే.జోగేశ్వరరావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వల్లూరి సూర్యప్రకాష్‌నాథ్, జూనియర్ అసిస్టెంట్ బి.రత్నశేఖర్, బ్యాంకుల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో బీసీ, ఓబీసీ సబ్సిడీ రుణసాయం కోసం దరఖాస్తు చేసుకున్న 640మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసినట్లు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు తెలిపారు. మండలంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమ, మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించి వారి అర్హత పత్రాలను పరిశీలించారు. మొదటి రోజు 17 గ్రామాలకు చెందిన 320, రెండో రోజు 10 గ్రామా లకు చెందిన 320 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు బ్యాకు అధికారులు తెలిపారు.



ఉంగుటూరులో కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

కానూరు టీడీపీ నాయకుడు సుంకర సాయిపై
క్రమశిక్షణ చర్యలకు ఎమ్మెల్యే సిఫారసు

పెనమలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీ 33వ డివిజన్ ప్రధాన కార్యదర్శి, కానూరు 5వ యూనిట్ ఇన్‌చార్జి అయిన సుంకర సాయిపై క్రమశిక్షణ చర్యలకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు సిఫార్సు చేశారు. సోషల్ మీడియాలో సుంకర సాయి ఇటీవల జనసేన పార్టీపై చేసిన అనుచిత వ్యాఖ్యల కారణంగా టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే సిఫార్సు చేశారు. సిఫార్సు లెటరుతో పాటు సుంకర సాయి చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన ఆధారాలను కూడా లేఖతో జతచేశారు.



ఉయ్యూరులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

వంట గ్యాస్ ధర తగ్గించాలి

ఉయ్యూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వంటగ్యాస్ ధరపెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు ఆరోపించారు. గ్యాస్ బండపై రూ.50 పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఉయ్యూరు సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేక ఆదాయం తగ్గి జీవనవ్యయం పెరిగి జీవించడం కష్టంగా ఉన్న పరిస్థితుల్లో గ్యాస్ ధరపెంచి కేంద్రప్రభుత్వం ప్రజలపై పెనుభారం మోపిందన్నారు. దేశానికి అవసరమైన పెట్రోల్ ఉత్పత్తుల్లో 80 శాతం ఇతర దేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నామని, అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రోలియం ధరలు తగ్గుతుంటే మనదేశంలో ధర తగ్గించకుండా పెంచడం దుర్మార్గమని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు, మాదాల వెంకటేశ్వరరావు, శీలం నారాయణరావు, బి రాజేశ్, కీర్తి, ఆర్‌పీపీ రెడ్డి, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బండారుగూడెంలో

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వంట గ్యాస్ ధర పెంచడంతో సామాన్యుడిపై భారం పడుతుందని సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బండారుగూడెంలో మంగళవారం వినూత్నంగా గ్యాస్ బండ ముందు నిరసన తెలిపి బండకు వినతిపత్రం అందజేసారు. పేద మహిళలకు ఉచితగ్యాస్ అని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం దొడ్డిదారిన గ్యాస్ ధర పెంచడం ప్రజలను మోసం చేయడమేనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు భారమైన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సునీత, పద్మ, కుమారి, జయ మ్మ తదితర మహిళలు, బొకినాల రాము, చక్రధర్, గంజి శేఖర్ పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎంకే స్కూల్ డైరెక్టర్ బాబు

మ్యాథ్స్ పోటీల్లో ఎంకే స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఉయ్యూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వేదిక్ మ్యాథ్స్ సంస్థ ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి మ్యాథ్స్ పోటీల్లో ఎంకే ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు విశేషప్రతిభ కనపరచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. పోటీల్లో పాల్గొన్న 12 మంది విద్యార్థుల్లో ఆరుగురు ప్రథమ, ఆరుగురు ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎంకె బాబు విద్యార్థులను అభినందించారు.

అకాల వర్షంతో విద్యుత్‌కు అంతరాయం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అకాలవర్షం, ఈదురుగాలులు కారణంగా మంగళవారం రాత్రి హనుమాన్‌జంక్షన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో పలు గ్రామాలకు దాదాపు రెండు గంటలు పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సెక్షన్ పరిధిలోని ఆరుగొలను, మడిచర్ల, బాపులపాడు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలిగింది. ఈదురుగాలులు కారణంగా విద్యుత్‌లైన్ల మీద చెట్టుకొమ్మలు, కొబ్బరి ఆకులు పడడడంతో కొన్ని చోట్ల తీగలు తెగిపోయాయి. విద్యుత్ సిబ్బంది రంగంలోకి దిగి మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : సేంద్రియ వ్యవసాయంలో పెట్టుబడి తగ్గి రైతుకు లాభదాయకంగా ఉండటంతో పాటు ప్రజలకు రసాయనాలు లేని పంటలు అందుతాయని సర్పంచ్ కాటూరి విజయభాస్కర్ అన్నారు. బొమ్ములూరులో మంగళవారం ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నవధాన్యాలను పండిచడం ద్వారా భూసారం పెరుగుతుందని తెలుపుతూ ఆసక్తి గల రైతులకు విత్తనాలను అందజేశారు. మట్టి గుళికల తయారీ విధానాన్ని సోదాహరణంగా వివరిస్తూ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, వీవో గుల్లపల్లి అనంతలక్ష్మి, పచ్చిగల్ల జ్యోతి, గుల్లపూడి ప్రసాద్, యర్రంశెట్టి బాబీ, మరియదాసు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కాటూరి విజయభాస్కర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెనమలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప సబ్ స్టేషన్ పరిధిలో గల 11కేవీ ఫీడర్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా తాడిగడపలో నేటి ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుణదల విద్యుత్‌శాఖ ఈఈ హరిబాబు తెలిపారు. తాడిగడప, హైస్కూల్ ప్రాంతం, ఊరచెరువు, ఎస్టీబీఎల్ కాలనీ, పెదపులిపాక గ్రామాల ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో
ముగిసిన చైత్రమాస నవరాత్రులు



గన్నవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో జరుగుతున్న చైత్ర మాస నవరాత్రులు మంగళవారంతో ఘనంగా ముగిసాయి. చివరి రోజు లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వాములకు వస్త్ర అలంకరణ చేసి వివిధ పరిమళ భరితమైన పుష్పాలతో అర్చనలు చేశారు. లలిత సహస్ర నామ, హనుమాన్ చాలీసా పారాయణం జరిపారు. అనంతరం అన్నే సాయి బాబు, శివకుమారి, బాయన సాంబశివరావు, విజయ నాగలక్ష్మి, కాసన్నేని లలితకుమారి, అట్లూరి శ్యాం ప్రసాద్, విజయలక్ష్మి దంపతుల సౌజన్యంతో భక్తు లకు ప్రసాద వితరణ చేశారు.



అన్న సమారాధన ప్రారంభిస్తున్న టీడీపీ నేత హరికృష్ణ

రెండువేల మందికి అన్నసమారాధన

కంకిపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు లాక్ రోడ్డు నాయిబ్రాహ్మణ రామాలయం వద్ద మంగళవారం 2 వేల మందికి అన్నసమారాధన చేశారు. టీడీపీ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై అన్న సమారాధన ప్రారంభించారు. వణుకూరు విక్రమ్, ఫులి శ్రీనివాసరావు, సుబ్బారావు, శివపార్వతి, సలీం, వెంకటేశ్వరరావు సేవలందించారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో పీ.తారేశ్వరరావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు స్వామి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


రహదారిపై చెల్లా చెదురుగా పడిన విద్యుత్ తీగలు

గూగుల్ తల్లీ.. ఇరికించేశావ్‌గా..!

● గూగుల్ మ్యాప్ సాయంతో వచ్చి సందులో ఇరుక్కుపోయిన కంటైనర్ లారీ

ఆటోనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గూగుల్ మ్యాప్‌ను అనుసరించి వచ్చిన కంటైనర్ లారీ దర్శిపేట లోని రావి చెట్టు సందులో ఇరుక్కుపోయింది. రాంగ్‌రూట్‌గా గుర్తించి రివర్స్ తీసుకుంటుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో విద్యుత్ తీగలు తెగి మరో రెండు విద్యుత్ స్తంభాలు విరిగాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కంటైనర్ లారీ పప్పుల మిల్లు సెంటర్‌లోని ఓ ఇంటి సామగ్రిని ఒడిశా తీసుకెళ్లేందుకు విజయవాడ చేరుకుంది. ఇంటి యాజమాని పెట్టిన లోకేషన్ ఆధారంగా లారీ డ్రైవర్ రామలింగేశ్వరనగర్ ఫ్యూక్రిడ్జ్ నుంచి చిన్నవంతెన మీదుగా దర్శిపేట వైపు చూపించడంతో అటుగా లారీని మళ్లించాడు. రామాలయం సమీపంలోని రావిచెట్టు వద్దకు రాగానే రహదారి చిన్నగా ఉందని గ్రహించి కంటైనర్ లారీని రివర్స్ చేయబోతుండగా విద్యుత్


రివర్స్ చేస్తుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కంటైనర్ లారీ

స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో విద్యుత్ సరఫరా అవుతున్న తీగలు రహదారిపై పడ్డాయి. స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సకాలంలో విద్యుత్‌ను నిలిపేశారు. పటమట పోలీసులు చేరుకుని డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించారు. లారీని తొలగిస్తే స్తంభం పడిపోయి పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపేయాల్సి వస్తుందని విద్యుత్ అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం కంటైనర్ లారీని తొలగించే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని సమాచారం.

రామలింగా.. దాహం దాహం..!

● శాఖల మధ్య సమన్వయం లోపం వల్లే సమస్య
● మనసు పెడితే 10 రోజుల్లో మంచినీటి సరఫరా
● విజయవాడ తూర్పులో 10వేల మందికి నీళ్లివ్వొచ్చు!
● పైపులైన్ల పనులకు అడ్డంకిగా రుద్రభూమి పరిసర స్థలాలు
● స్థల యజమానులకు ప్రయోజనం కల్పిస్తేనే..! సమస్యకు పరిష్కారం
● కలెక్టర్ రంగంలోకి దిగితే తప్ప పరిష్కారం కాదు!

రామలింగేశ్వరనగర్ 1500 కేఎల్ రిజర్వాయర్ పనుల్లో జాప్యం

మనసు పెడితే పది రోజుల్లో అయిపోయే పనిని శాఖల మధ్య సమన్వయం లేక సాగదీస్తున్నారు. రామలింగేశ్వరనగర్‌లో 1500 కేఎల్ ఓవర్ హెడ్ రిజర్వాయర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి 10వేల కుటుంబాల దాహార్తిని తీర్చే అవకాశమున్నా సమన్వయ లోపంతో తీవ్రజాప్యం జరుగుతోంది. ప్రస్తుతం వేసవిలోకి అడుగు పెట్టడంతో రానున్న రోజుల్లో తలెత్తే దాహార్తిని కేవలం 10 రోజుల్లో తీర్చగలిగే పరిస్థితి ఉన్నా అడుగు ముందుకు పడటం లేదు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ రంగంలోకి దిగితే తప్ప శాఖల మధ్య సమన్వయం తీసుకురావటం అసాధ్యం. - ఆంధ్రజ్యోతి, విజయవాడ



పటమట తూర్పు ప్రాంతంలోని శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, భారతీనగర్, జేడీనగర్, అశోక్ నగర్ తదితర ప్రాంతాల్లో నివశిస్తున్న 10వేల మందికి పైగా ప్రజలకు సమృద్ధిగా రక్షిత మంచినీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ రక్షిత మంచినీటి పథకంలో భాగంగా ఇప్పటికే 1500 కేఎల్ రిజర్వాయర్ పనులు పూర్తయ్యాయి. ఇక్కడే ఫిల్టరైజేషన్ ప్లాంట్ పనులు కూడా జరిగాయి. కేవలం పైప్ లైన్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రామలింగేశ్వరనగర్ ఫిల్టరైజేషన్ ప్లాంట్ నుంచి రక్షణ గోడ వెంబడి ప్రకాశం బ్యారేజీ ఎగువన ఉన్న హెడ్ వాటర్ వర్క్స్ వరకు పైపులైన్ల పనులు చేపట్టడానికి టెండర్లు పిలిచారు. పైపులైన్ల పనులు కూడా సగం పూర్తయ్యాయి. ప్రకాశం బ్యారేజీ, రుద్రభూమి వద్ద పనులు చేపట్టాల్సి ఉంది. రుద్రభూమి వెంబడి ప్రైవేటు స్థలాల మీదుగా పైపులైన్ వెళితే సమానంగా ఉంటుంది. భారీ పైపులైన్లు కావటం హై ప్రెజర్‌తో నీరు వచ్చే అవకాశం ఉండటంతో వంకర టింకలుగా ఉంటే ఎప్పుడైనా ప్రమాదమే. లీకేజీ తలెత్తితే మొదటికే మోసం వస్తుంది. కాబట్టి రుద్రభూమి పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు ఇళ్లస్థలాలు కలిగిన వారిని ఒప్పించ గలిగితే సమస్యకు చెక్ పడుతుంది. ఇక్కడున్న ప్రైవేటు స్థలాలకు చెందిన తాతలు, తండ్రులు వీఎంసీ అవసరాల కోసం స్థలాలు ఇస్తూనే ఉన్నారు. అప్పట్లో ఉచితంగా అప్పగించి రిజిస్ట్రేషన్లు చేసిన ఉదంతాలున్నాయి. కాలక్రమంలో ఈ భూములు ఖరీదైనవిగా మారాయి. గతంలో మాదిరిగా భూములు వదలుకోవటానికి స్థానికులు ఇప్పుడు సిద్ధంగా లేరు. ఎంతో ఖరీదైన భూములను అప్పనంగా తీసుకోవటం కంటే వారికి ప్రయోజనం కల్పించేలా టీడీఆర్ బాండ్లను జారీ చేయటం, ఇతరత్రా ప్రయోజనాలు కల్పిస్తే సమస్య పరిష్కారమవుతుంది. ఇందుకోసం ఇప్పటికే వీఎంసీ అధికారులు సర్వే చేపట్టాలని నిర్ణయించినా రెవెన్యూ, కార్పొరేషన్ విభాగాల మధ్య సమన్వయ లేమితో సర్వేలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ సమస్య తేలితే పైపులైన్లు పూర్తిచేసి కృష్ణా నీటిని రామలింగేశ్వరనగర్ రిజర్వాయర్‌కు తీసుకు వెళ్లటానికి పట్టుమని పది రోజులు కూడా పట్టదు. దీనిపై ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నేరుగా స్థానికుల వద్దకే వెళ్లి సంప్రదింపులు చేశారు. ఎన్నో దఫాలు తమ వంశీకులు పైసా ఆశించకుండా కార్పొరేషన్‌కు ఉచితంగా స్థలాలు ఇచ్చి సహకరించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడుంటున్న వారసులకు తగిన ప్రయోజనం కల్పించాల్సిన అవసరం ఉంది. కలెక్టర్ లక్ష్మీశ దీనిపై దృష్టి సారించి కమిషనర్‌తో చర్చించి రెవెన్యూ శాఖ రంగంలోకి దించి భూముల సర్వే చేయించాల్సిన అవసరం ఉంది. తర్వాత స్థల యజమానులకు వీఎంసీ తరఫున బాండ్లు కానీ లేదా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పరిహారాన్ని కానీ ఇప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కోర్టు ఫీజు స్టాంపుల కొరత తీర్చండి

● రాష్ట్ర ఐలూ ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు

విజయవాడ లీగల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో కోర్టు ఫీజు స్టాంపుల కొరతను తీర్చాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు మంగళవారం న్యాయశాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించారు. 3 నెలల నుంచి న్యాయస్థానాలు, రెవెన్యూ కోర్టులు, వివిధ న్యాయ సంబంధిత ట్రిబ్యునల్స్‌లో ఉపయోగించే కోర్టు ఫీజు స్టాంపులు అందుబాటులో లేవన్నారు. దీంతో న్యాయవాదులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పిటీషన్లు వేయాలంటే కోర్టు ఫీజులు తప్పనిసరన్నారు, రూ.1, రూ.2కు కూడా బ్యాంకు చలానా ద్వారా చెల్లించే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో సమయంతోపాటు పరిపాలన విషయాలు కూడా ఆలస్యం అవుతున్నాయన్నారు. జిల్లాల్లో రిజిస్ట్రార్లను కలిస్తే ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని చెబుతున్నారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే కోర్టు ఫీజు స్టాంపులు అందుబాటులోకి తెచ్చి సమస్యను పరిష్కరించాలని ఐలూ తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్టు మాధవరావు పేర్కొన్నారు.

బ్లాకులో నోటరీ స్టాంపులు

● సీనియర్ న్యాయవాది గురునాథం

కోర్టు ఫీజు స్టాంపులతో పాటు నోటరీ స్టాంపులు కూడా దొరకడం లేదని సీనియర్ న్యాయవాది వి.గురునాథం తెలిపారు. నోటరీ చేయాలంటే రూ.5 స్టాంపు లేక బ్లాకులో కొని తీసుకురావాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. విజయవాడ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో దొరక్కపోవడంతో కంకిపాడు రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి బ్లాక్‌లో రూ.5 స్టాంపును రూ.6, 7 చెల్లించి తెస్తున్నామని నోటరీలు వాపోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కోర్టు ఫీజు స్టాంపులు, నోటరీ స్టాంపులు అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు.

అసత్య ప్రచారాలను ఖండిస్తున్నాం

● ఎండీ కొల్లి ఈశ్వరబాబు ● డీజీపీతోపాటు సీపీ, స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు



చిట్టినగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 60 ఏళ్లుగా ఉన్నత విలువలతో పాడి రైతుల ఆర్థికాభివృద్ధి, ఉద్యోగులకు సంపూర్ణ భద్రత, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్న సంస్థ కృష్ణా మిల్క్ యూనియన్ అని యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు అన్నారు. అటువంటి యూనియన్‌పై రెండు రోజులుగా సోషల్ మీడియా గ్రూప్‌లలో ప్రచారమవుతున్న అసత్య వీడియో సందేశాలు, ఒక పత్రికలో ప్రచురించిన వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంగళవారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా గ్రూప్‌లలో ప్రచారమవుతున్న సందేశంలో, ఒక పత్రికలో ప్రచురించిన కథనంలో పేర్కొన్న కొడాలి ప్రమీల అనే మహిళ కృష్ణా మిల్క్ యూనియన్ ఉద్యోగిని కాదన్నారు. ఆమెకు కృష్ణా మిల్క్ యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. సమితికి సంబంధం లేని వ్యక్తులు దురుద్దేశం, స్వార్థ ప్రయోజనాల కోసం సమితి ఛైర్మన్, పాలక వర్గ సభ్యులు, సమితి ఉద్యోగులపై అసత్య ఆరోపణలు చేస్తూ, సమితి ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నములను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ అసత్య ప్రచారాలపై డీజీపీ, సిటీ పోలీస్ కమిషనర్, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. త్వరలోనే కుట్ర పూరితమైన అసత్య ప్రచారాలు చేస్తున్నవారిని గుర్తించి చర్యలు తీసుకోమని కోరగా, ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని ఈశ్వరబాబు తెలిపారు.

ఘనంగా జల, పంచామృతాభిషేకాలు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అద్దాల బజార్‌లో వేంచేసి యున్న కోట మైసమ్మ సహిత వెండి మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం పునఃప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు జలాభిషేకం, పంచా మృతాభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ ప్రభూత బలి, మూల మంత్ర అనుష్ఠానములు యాజ్ఞీకులు వెంకటరమణశర్మ, కిశోర్ శర్మ, సత్యనారాయణశర్మ బృందం జరిపించింది. 108 కలశాల్లో పంచామృ తాలు, వివిధ నదీ జలాలు తీసుకుని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి మాడవీధుల్లో ప్రతిష్ఠించనున్న శ్రీమహాలక్ష్మీ అమ్మ వారి మూల విరాట్, ఉత్సవమూర్తులు, గణపతి, షిర్డి సాయి విగ్రహాలను రథోత్సవం నిర్వహించారు. అనంతరం జలాభిషేకం చేశారు. మహిళా కమిటీ సభ్యులు ఏకరూప దుస్తుల్లో పాల్గొన్నారు. ట్రస్ట్ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి కొండూరి నాగేశ్వరరావు, నిర్వహణ కమిటీ చైర్మన్ సూరె రాము, గొల్లపుడి ముక్తేశ్వరరావు, ఆర్. శ్రీనివాసరావు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 8-59 గంటలకు తాత్వికులు, బలుసుపాడు శ్రీగురుధామ్ వ్యవస్థాపకులు గెంటేల వెంకటరమణ దంపతుల చేతుల మీదగా యంత్రస్థాపన, పునఃప్రతిష్ఠ జరుగుతుందని, అనంతరం పూర్ణాహుతి, అన్నసమారాధన ఉంటుందని, భక్తులంతా హాజరు కావాలని కమిటీ కోరింది.

వైభవంగా సాగుతున్న వెండి మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం పునఃప్రతిష్ఠ ఉత్సవాలు



ప్రతిష్ఠించనున్న దేవతామూర్తులకు గ్రామోత్సవం, అభిషేకం చేస్తున్న భక్తులు

సీతారామ రజక వీధిలో..

పట్టణంలో శ్రీ సీతారామ రజకవీధిలో శ్రీ సీతారామలక్ష్మణ, ఆంజనేయ, విజయగణపతి, నాగరాజు స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ బుధవారం జరగనుంది. ఐదేళ్ల క్రితం వేప చెట్టు కింద నిర్మించిన రామ మందిరం, చెట్టు పెరిగిపోయి మందిరాన్ని తోసేయ్యటంతో పునఃప్రతిష్ఠ అవసరమైంది. మంగళవారం ప్రతిష్ఠించనున్న దేవతామూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ఆర్టీసీ బస్టాండ్ వరకు ఉత్సవం జరిపించారు. యాజ్ఞీకులు అవినాష్, నరసింహం కార్యక్రమాలు జరిపించారు.

వైభవంగా రామయ్య పట్టాభిషేకం


శ్రీరామపట్టాభిషేకంలో విగ్రహాలకు అభిషేకం చేస్తున్న అర్చకులు

గుడివాడ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలం దొండపాడు గ్రామంలో శ్రీ కోదండరామస్వామి మహాసామ్రాజ్య పట్టాభిషేకం మంగళవారం ఘనంగా జరిగింది. ఆంజనేయస్వామికి నాగవల్లి దళార్చన అద్భుతంగా జరిగింది. శ్రీ త్రిదండి దేవనాద రామానుజ జీయర్ స్వామి అనుచరులు, పురోహితుల నడుమ మహాసామ్రాజ్య పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ, దొండపాడు గ్రామస్థుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

ఆస్టర్ రమేష్ ఆసుపత్రిలో

వెర్టిగో, ఎపిలెప్సీ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభం


క్లినిక్‌ను ప్రారంభిస్తున్న సుందరాచారి, కుమారవేలు

ప్రభుత్వాసుపత్రి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరం ఎంజీ రోడ్డులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్లో ఆధునిక వెర్టిగో, ఎపిలెప్సీ స్పెషాలిటీ క్లినిక్‌ను ప్రముఖ న్యూరాలజిస్టులు డాక్టర్ ఎన్.వి సుందరాచారి, ప్రిన్సిపల్, గుంటూరు మెడికల్ కాలేజ్, రిటైర్డ్ మేనేజర్ జనరల్ డాక్టర్ ఎస్.కుమారవేలు, చీఫ్ న్యూరాలజిస్టు, ఆస్టర్ రమేష్ గ్రూప్ ప్రారంభించారు. ఈసందర్భంగా వెర్టిగో క్లినిక్ వివరాలను డాక్టర్ లక్ష్మీ వెల్లడించారు. వెర్టిగో, బ్యాలెన్స్ సమస్యలతో బాధపడే రోగులకు ఆధునిక డయాగ్నోస్టిక్ పరికరాలతో నిపుణుల బృందం సమగ్ర వైద్య సేవలు అందించనుందన్నారు. ఈ క్లినిక్‌లో వీడియో నిస్టాగ్మోగ్రఫీ (వీఎన్‌జీ), ఎలక్ట్రోనిస్టాగ్మోగ్రఫీ (ఈఎన్‌జీ), వెస్టిబులర్ ఎవోక్డ్ మయోజెనిక్ పొటెన్షియల్స్ (వీఈఎమ్‌పీ), పోస్టురోగ్రఫీ వంటి ఆధునిక పరికరాలతో సమగ్ర వెస్టిబులర్ ఎవాల్యుయేషన్ థెరపీ (వీఆర్‌పీ), కానలిత్ రీపోజర్ (సీఆర్‌పీ), బ్యాలెన్స్ అండ్ పాల్ ప్రివెన్షన్ వంటి వైద్య సేవలందిస్తామన్నారు. ప్రముఖ ఎపిలెప్టాలజిస్ట్ డాక్టర్ పావులూరి హరిణి మాట్లాడుతూ ఎపిలెప్సి క్లినిక్‌లో 64 చానెల్ వీడియో ఈఈజీ, సీటీ స్కాన్, ఎమ్మార్ఐ వంటి అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎపిలెప్సీ అనేది మెదడును ప్రభావితం చేసే దీర్ఘకాలిక నాడీ వ్యాధి అన్నారు. ఇది శిశువులను, వృద్ధులను ఎవరినైనా ప్రభావితం చేయగలదన్నారు. మెదడులో విద్యుత్ యాక్టివిటీ గాయాలు, ఇన్ఫెక్షన్స్, జన్యుపరమైన కారణాలు, ట్యూమర్లు వంటి కారణాలతో ఈ వ్యాధి వస్తుందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎన్.వి సుందరాచారి మాట్లాడుతూ ఈవ్యాధుల పట్ల రోగులకు అవగాహన కల్పించాలన్నారు. అపోహలు తొలగించి సరైన వ్యాధి నిర్ధారణతో ఖచ్చితమైన వైద్యాన్ని అందించడం ద్వారా రోగికి ఉపశమనం కలుగుతుందన్నారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎండీ పోతినేని రమేష్‌బాబు, ఛైర్మన్ ఎం.ఎస్ రామమోహనరావు, డీఎమ్‌డీ డాక్టర్ మమత రాయపాటి, మెడికల్ డైరెక్టర్ నాదెళ్ల గిరిబాబు, యూనిట్ హెడ్ డాక్టర్ కారుపాటి సుదర్శన్, కార్తీక్ చైదరి పాల్గొన్నారు.


డ్రోన్ ఫెస్ట్‌లో విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

డ్రోన్ ఫెస్ట్ నియోజకవర్గానికే గర్వకారణం

● ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె

పటమట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ ఫెస్ట్ తమ నియోజకవర్గంలో జరగడం నియోజకవర్గానికే గర్వకారణమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. విజయవాడ డాన్‌బోస్కో స్కూల్లో సోమవారం డ్రోన్ ఫెస్ట్ -2025ను సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వ్యవసాయ రోబో తనను ఆకట్టుకుందన్నారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు స్ఫూర్తితో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను పుణికిపుచ్చుకొని పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నేర్పుతున్న స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. స్కూల్ ప్రయోగశాలలో త్రీడీ ప్రింటింగ్ ద్వారా తయారు చేసిన డ్రోన్ గురించి తెలుసుకొని దాని సాంకేతికతను పరిశీలించి ఉపాధ్యాయ బృందంపై ప్రశంసల వర్షం కురిపించారు. అపుస్మా అధ్యక్షుడు తులసి ప్రసాద్ మాట్లాడుతూ ఈప్రదర్శనను నిర్వహించడం అభినందనీయమన్నారు. టికీ బోర్డు చైర్మన్ నల్లమిల్లి వెంకట రెడ్డి మాట్లాడుతూ డాన్‌బోస్కో యాజమాన్యం విద్యతో పాటు విద్యార్థులను నైపుణ్యాలను వెలికితీయడం అభినందనీయమన్నారు.

జగ్గయ్యపేట రైలు పట్టాలపై మృతదేహం

● చెల్లాచెదురైన శరీరభాగాలు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట సమీపంలో రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం ఉదయం రైల్వే అధికారులు గుర్తించారు. ఉదయాన్నే ట్రాక్‌ను క్లీన్ చేసేందుకు వెళ్లిన సిబ్బంది ట్రాక్‌పై చెల్లా చెదురుగా శరీర భాగాలు పడి ఉండటాన్ని గమనించి స్టేషన్ మాస్టర్‌కు తెలియజేయగా ఆయన విజయవాడ జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ చిందరవందరగా ఉన్న శరీర భాగాలను గుర్తించి ఒక చోటకు చేర్చి పోస్టుమార్టమ్ నిమిత్తం విజయవాడ తీసుకెళ్లారు. 30-35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండవచ్చని కుడిచేతిపై ప్రభాస్, అమ్మ, సత్యంబాబు, ఏసుప్రభు శిలువ గుర్తు ఉంది. భుజంపై ఆంజనేయస్వామి చిత్రం ఉంది. తలపై భాగం, నుదురు ఛిద్రమై ఉండటంతో గుర్తు పట్టే పరిస్థితి లేదు. బ్లూ కలర్ జీన్స్, రెడ్ కలర్ కోట్ మోడల్ టీ షర్టు వేసుకున్నట్టు హెచ్‌సీ చెప్పారు. సోమవారం రాత్రి జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. సంఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? బలవన్మరణమా? అన్నది అంతుపట్టకుండా ఉంది. సర్కిల్ పరిధిలో మిస్సింగ్ కేసులపై విచారిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే రైల్వే సీఐ జేవీ రమణ (94406 27544), హెచ్‌సీ ప్రసాద్ 94917 36189 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

క్లస్టర్ హెచ్‌ఎం పోస్టును గ్రేడ్-1గా మార్చాలి

● డెమొక్రటిక్ పీఆర్‌టీయూ



గవర్నర్‌పేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ నూతన విద్యా సంస్కరణల్లో భాగంగా ఏర్పాటు చేసిన క్లస్టర్ ప్రధానోపాధ్యాయుల పోస్టును గ్రేడ్ వన్ ప్రధానోపాధ్యాయుడిగా ప్రమోట్ చేయాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను కోరారు. విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజును మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసిన ఆయన ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ ఎస్‌సీటిఈ విధానాల ప్రకారమే నోటిఫికేషన్ ఇచ్చామని, రిజిస్టర్ సంఘాలతో ఈనెలలో సమావేశం నిర్వహిస్తామని, మిగిలిన అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉంచుతామని హామీ ఇచ్చినట్టు డెమొక్రటిక్ పీఆర్‌టీయూ అధ్యక్షుడు తెలిపారు.

చెరువును స్వాధీనం చేసుకుంటాం

● వీఎంసీ ఇన్‌చార్జి ఎస్టేట్ ఆఫీసర్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

వన్‌టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 64వ డివిజన్ కుందావారి కండ్రిక వెళ్లే దారిలో ఉత్తరం వైపునున్న 23 ఎకరాల చెరువును అనధికారికంగా చేపల పెంపకం జరుగుతోందని వీఎంసీ ఎస్టేట్ ఇన్‌చార్జి ఆఫీసర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న ఆంధ్రజ్యోతిలో 'కండ్రికలో చెరువు లీజు దందా' అనే ప్రధాన శీర్షికలో ఈ 23 ఎకరాల చెరువు గురించి వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. ఈ మేరకు కథనంలోని అంశాలను పేర్కొంటూ 23 ఎకరాల చెరువును ఎలాంటి అనుమతులు లేకుండా చేపల పెంపకం జరుగుతుందని స్థానికులే చెరువులో చేపల పెంపకం చేస్తున్నారన్నారు. పూర్తి విచారణ చేసి వీఎంసీ స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు.


సమైక్యతా శంఖారావం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు, కళాకారులు

సమైక్యతా శంఖారావం సదస్సులో పాల్గొనండి

● సాహితీవేత్తలు, కళాకారులు, సంఘాలకు పిలుపు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లిం, మైనారిటీల త్యాగాలు మరుగున పడేశారని, భారత రాజ్యాంగంలో కల్పించబడిన లౌకిక సమానత్వ హక్కుల్ని కాలరాస్తున్నారని సాహితీ స్రవంతి సంస్థ కార్యదర్శి వరప్రసాద్ అన్నారు. ఈ నెల 13న నగరంలో జరిగే సమైక్యతా శంఖారావం సదస్సులో సాహిత్యవేత్తలు, కళాకారులు భాగస్వామ్యం కావాలని కోరారు. మంగళవారం వివిధ సాహిత్య, కళాకారుల సంఘాల ప్రతినిధులు ఎంజీ రోడ్డులోని ఎంబీవీకే భవన్‌లో సమావేశం నిర్వహించారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ సదస్సుకు రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్, పౌరహక్కుల నేత హరగోపాల్, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ లాంటి ప్రముఖులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. మైనార్టీల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధి షఫీ అహ్మద్, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్, ప్రజానాట్యమండలి కార్యదర్శి అప్పన్న, విరసం నేతలు అరసవల్లి కృష్ణ, మోతుకూరి అరుణ్‌కుమార్, జాషువా సంస్థ గుండు నారాయణ, ఎక్సరే సంస్థ ప్రతినిధి బి. ఆంజనేయరాజు, మందరపు హైమావతి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

మొవ్వ ఏఎంసీ వైస్ చైర్మన్‌గా సనకా కిరణ్



సనకా కిరణ్

ఉయ్యూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పమిడిముక్కల మండల జనసేన అధ్యక్షుడు, మంటాడకు చెందిన సనకా కిరణ్ నియమితులయ్యారు. పార్టీ అభివృద్ధికి కృషిచేస్తూ 2024 ఎన్నికల్లో పామర్రు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి విజయానికి కిరణ్ విశేషంగా కృషిచేశారు. వైస్‌చైర్మన్‌గా అవకాశం కల్పించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, సీఎం చంద్రబాబునాయుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, జనసేన జిల్లా అధ్యక్షుడు బి. రామ్, పామర్రు ఇన్‌చార్జ్ తాడిశెట్టి నరేశ్‌కు కిరణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

తడి, పొడి చెత్తలపై అవగాహన తప్పనిసరి

● కలెక్టర్ డీకే బాలాజీ

కూచిపూడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. గూడపాడులో తడి, పొడి చెత్త సేకరిస్తున్న విధానాలు సోమవారం ఆయన పరిశీలించారు. తడి, పొడి చెత్తను ఇళ్ల వద్దనే వేరు చేసి సిబ్బందికి అందించాలన్న విధానంపై ప్రజలకు అవగాహన కల్పించటంలో విఫలం చెందారని అధికారుల తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పనుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. మళ్లీ పది రోజుల్లో వస్తానని, దీనిపై మెరుగైన ఫలితాలు కనిపించాలని అధికారులను ఆదేశించారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం దిశగా అడుగులు వేద్దామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

గూడపాడు పర్యటన ముగించుకుని పెదపూడి డ్రైనేజీ వ్యవస్థ తీరుతెన్నులు పరిశీలించారు. అనంతరం తడి, పొడి చెత్త సేకరణపై అధికారులు, పంచాయతీ సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన డ్రెయినేజీ నిర్మాణంలో అవలంభించిన విధానంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివ రామకృష్ణ ప్రసాద్‌ను ప్రశంసిస్తూ అతనికి వాచ్‌ని బహుమతిగా అందించారు. మిగిలిన చోట్ల ఇలాంటి డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇదే సందర్భంలో గ్రామసర్పంచ్ తాతా రజనిని సైతం డ్రెయినేజీ నిర్మాణంలో తీసుకున్న చర్యలపై అభినందనలు తెలిపారు. గూడపాడులో అధికారులకు మంద లింపులు, పెదపూడిలో ప్రశంసలు లభించాయి. ఈ కార్యక్రమంలో ఎండీవో జె.విమాదేవి, ఈవోపీఆర్‌డీ పరమాత్మ, గ్రామపంచాయతీ కార్యదర్శి సోమేశ్వరరావు, గ్రామసర్పంచ్‌లు తాతా ఉగాది లక్ష్మి, తాతా రజని, పారిశుధ్య కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.



గూడపాడులో తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ బాలాజీ



ప్రశంసాపత్రాలు అందుకున్న రాఘవేంద్ర సాయి షైనింగ్ స్టార్ స్కూల్ విద్యార్థులు

కరాటే పోటీల్లో సాయి షైనింగ్ స్టార్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాఘవేంద్ర నగర్‌లో సాయి షైనింగ్ స్టార్ స్కూల్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో 27 మంది విద్యార్థులు వివిధ రకాల అవార్డులు, బహుమతులు అందుకున్నారు. టెస్ట్‌లో పాల్గొన్న 8 మందికి ఎల్లో బెల్ట్, ఐదుగురికి ఆరేంజ్, 13 మందికి గ్రీన్ బెల్టులు మొత్తం 27 మంది బెల్టులు, సర్టిఫికెట్లు అందుకున్నారు. కోచ్ కె.శివరామకృష్ణను అభినందించారు. మేనేజ్‌మెంట్ కమిటీ లింగమనేని జగదీష్, స్రవంతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశంసాపత్రం అందుకున్న విద్యార్థులను సన్మానించారు.

కార్పొరేషన్ రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

తోట్లవల్లూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండల కార్యాలయంలో మంగళవారం బీసీ కార్పొరేషన్ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 48 యూనిట్లు మాత్రమే ఉండగా 433 మంది బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో 390 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని ఎంపీడీవో రవికాంత్ తెలిపారు. మండల కార్యాలయం లబ్ధిదారులతో కిటకిటలాడింది. ఐదేళ్ల తరువాత కార్పోరేషన్ రుణాలను ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవటంతో భారీగా దరఖాస్తులు చేయటం గమనార్హం. అయితే 390 మందిలో 48 మంది లబ్ధిదారులను ఎంపిక చేయటం కత్తిమీద సాములాంటి పరిస్థితి నెలకొంది.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

నలుగురు వీఆర్వోల బదిలీ

గుడివాడ రూరల్ : మండలంలో నలుగురు వీఆర్వోలు పదోన్నతిపై బదిలీపై వెళ్లినట్టు తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. వీఆర్వోగా పని చేసే సాల్మన్ రాజు పెడన తహసీల్దార్ కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్‌గా వెళ్లారని తెలిపారు. వీఆర్వోలు వి.శ్యాంబాబు, షేక్ మరియాంబి, కె.అనిల్ కుమార్‌లు జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారన్నారు. మంగళవారం ఉదయం రీలీవ్ అయ్యి మధ్యాహ్నం విధుల్లో జాయిన్ అయినట్టు తెలిపారు.

మట్టినమూనా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

గుడివాడ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మట్టి నమూనా కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి తెలిపారు. గుడివాడ మార్కెట్ యార్డులో ఉన్న మట్టి నమూనా కేంద్రాన్ని మంగళవారం ఆమె ఏవో బోలెం అనంతలక్ష్మితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో గుడివాడ మార్కెట్ యార్డులో మట్టి నమూనా కేంద్రం ఉండేదని గుర్తు చేశారు. గత ఐదేళ్ల నుంచి మూతబడిన మట్టి నమూనా కేంద్రం మరమ్మతుల కోసం కూటమి ప్రభుత్వం ఆరు లక్షల నిధులు విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో ఆమె మట్టి నమూనా కేంద్రానికి మరమ్మతులు చేయిస్తున్నామని, మరో పది రోజుల్లో పూర్తవుతాయన్నారు. గుడివాడను జిల్లా మట్టి నమూనా కేంద్రంగా ఏర్పాటు చేయటానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 25 వేల మట్టిని ల్యాబుల్లో పరిశీలిస్తామని తెలిపారు. జిల్లా మొత్తం రైతులు ఈ మట్టి నమూనా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పొలంలో తీసుకొచ్చిన మట్టికి కూడా వ్యవసాయ శాస్త్రవేత్తలు పరీక్షలు చేస్తారన్నారు. పొలంలో పొటాష్, నత్రజని, భాస్వరం తదితర విషయాలు తెలుస్తాయన్నారు. దీనివల్ల సేంద్రీయ ఎరువులు ఏ విధంగా వాడాలో తదితర అంశాలు తెలుసుకోవచ్చునని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతులు పరిశీలిస్తున్న ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

రొయ్యూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

తోట్లవల్లూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామంలో దాళ్వా వరి అధికంగా సాగయిందని, నాలుగైదు రోజుల్లో వరికోతలు కోస్తున్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రొయ్యూరు రైతులు కోరారు. రైతులు చిరుగుపాటి వెంకటేశ్వరావు, ఉప్పులూరి వెంకట రమణ, దత్తి ప్రసాద్, మోర్ల శ్రీనివాసరావు, లుక్కా రామారావు, లుక్కా సూర్యచంద్రరావు, సుబ్బారావు తదితరులు మంగళవారం కోతకు సిద్ధమైన వరిపొలాలను అధికారులకు చూపించారు. రొయ్యూరులో 500 ఎకరాల దాళ్వా వరి సాగయిందన్నారు. అధికారులను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం లేకపోతే ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో నష్టపోవలసి ఉంటుందని రైతులు చెప్పారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారులకు తెలియజేశాం

మండలంలో 1,120 ఎకరాల్లో దాళ్వా వరిసాగయిందని మండల వ్యవసాయాధికారి జి నాగేశ్వరరావు తెలిపారు. రొయ్యూరు, బొడ్డపాడు, వల్లూరుపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరముందని అధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆయన చెప్పారు. ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు వస్తే ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.



కోతకు సిద్ధమైన దాళ్వా వరిపొలాలను చూపుతున్న రైతులు

నేటి నుంచే పోషణ్ పక్వాడా

పెదపారుపూడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 9 నుంచి 22వ తేదీ వరకూ పోషణ్ పక్వాడా కార్యక్రమాలు నిర్వహించనున్నామని అగన్వాడీ సూపర్‌వైజర్లు అరుణ కుమారి, శివ కుమారిలు తెలిపారు. పెదపారుపూడి మండలం వెలుగు కార్యాలయంలో బుధవారం నుంచి జరగబోయే పోషణ్ పక్వాడా ఇనాగిరేషన్ కార్యక్రమం, వెబ్ కాస్ట్ వీసీలో వారు అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి లైవ్ వీక్షించారు. అనంతరం ఇతర డిపార్ట్‌మెంట్ వారితో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం, హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

గుడ్లవల్లేరు : అంగలూరు డైట్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం పరీక్షలు పూర్తిచేసుకున్న విద్యార్థులకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం మంగళవారం కళాశాలలో నిర్వహించారు. డీఎడ్ చివరి సంవత్సరం విద్యార్థులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళుకవలను ఉపాధ్యాయులు అందజేశారు. అనంతరం విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు వినయ్‌కుమార్, మోహినీ కుమారి, జయశ్రీ ప్రకాశం,రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

గుత్తికొండ సుబ్బారావుకు సత్కారం

గుడ్లవల్లేరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న పురస్కారాన్ని ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావుకి ప్రధానం చేయడం అభినందనీయం అని పలువురు వక్తలు అభినందించారు. మంగళవారం సింగలూరు గ్రామంలో భాగ్యవిధాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బండారు బ్రహ్మంరావు, సీతా మహాలక్ష్మి మెమోరియల్ కమ్యూనిటీ హాల్లో గుత్తికొండ సుబ్బారావుకి అభినందన సభ నిర్వహించారు. భాగ్యవిధాత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బండారు శ్యామ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ అభినందన సభలో ముఖ్యఅతిధిగా ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హైస్కూ ల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాస మూర్తి, కొరెడ్ల సుశీల, భవిష్య, పట్టి నాగలక్ష్మి,పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

గుడివాడ, ఏప్రిల్ 08(ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు రైల్వేస్టేషన్ దగ్గరలో పుల్లేరు వంతెనపై పట్టాలు దాటే క్రమంలో గుర్తు తెలియని వ్యక్తిని మచిలీపట్నం-గుడివాడ ప్యాసింజర్ రైలు ఢీకొనగా మృతి చెందినట్టు గుడివాడ జి.ఆర్.పి ఎస్సై మహబూబ్ షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతునికి 50 సంవత్సరాలు వయస్సు ఉంటుందన్నారు. చామనఛాయ రంగు, నెరిసినజుట్టు, ఒంటిపై కుంకుమ రంగు ఫుల్ హ్యాండ్ షర్టు, బ్లూ నలుపు డిజైన్ గల లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. గుడివాడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఆయన తెలిపారు. మృతుని వివరాల తెలిసిన వారు సెల్ నెం. 94406 27570, 73960 69566కు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

తోట్లవల్లూరు : పెనమకూరు గ్రామ సచివాలయంలో ఓసీ, బీసీ మహిళలకు ఏర్పాటు చేసిన కుట్టు కుట్టు శిక్షణా కేంద్రాన్ని మంగళవారం మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ ప్రారంభించారు. 140 మంది ఓసీ, బీసీ మహిళలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, వీరికి 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు రూ 12 వేలు విలువ కలిగిన కుట్టు మిషన్‌ను ఉచితంగా అందిస్తారని శివరామ్‌ప్రసాద్ చెప్పారు. పంచాయితీ కార్యదర్శి పిచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

వంతెన లాకులకు మరమ్మతులు చేపట్టాలి

● డీసీ చైర్మన్ ఏసుబాబు

నందివాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చంద్రయ్య కాలువపై నిర్మించిన వంతెన లాకులకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని డీసీ చైర్మన్ ఏసుబాబు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పోలుకొండ వద్ద చంద్రయ్య కాలువపై నిర్మించిన వంతెన లాకుల క్రింద చప్టాను మంగళవారం ఆయన డీసీ ఉపాధ్యక్షుడు ఎస్.రాకేష్, ఇరిగేషన్ ఏఈ బేగ్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయ్య కాలువపై వంతెన నిర్మించి సుమారు 90 ఏళ్లవుతుందన్నారు. వంతెన లాకులు, పక్కన నిర్మించిన చప్టా సైతం పూర్తిగా పాడైపోయాయన్నారు. ఈ పనులకు ఎస్టిమేషన్లు వేయాలని సంబంధిత అధికారులను కోరారు. అనంతరం ఏఈ బేగ్ మాట్లాడుతూ ఈ వంతెన లాకుల మరమ్మతులకు ఎస్టిమేషన్లు వేసి త్వరలో పనులు నిర్వహించేందుకు టెండర్లు పిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రపాక డీసీ చైర్మన్ పాలడుగు నానారావు, పైడి పిచ్చియ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.



వంతెనను పరిశీలిస్తున్న డీసీ అధికారులు, ఏఈ బేగ్

గురుకుల పాఠశాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

గుడివాడ రూరల్: మోటూరు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలు ఈ నెల 13వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్టు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బూరగడ్డ సంజీవనిదేవి మంగళవారం తెలిపారు. ఏప్రిల్ 13వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశపరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టిక్కెట్లు వెబ్ సైట్‌లో డౌన్‌లోడు చేసుకుని తీసుకురావాలని తెలిపారు.

రైల్వేగేటును విస్తరణ చేయాలని సంతకాల సేకరణ



సంతకాల సేకరణ చేపట్టిన భవిష్యత్ భద్రతా దళం సభ్యులు

గుడివాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కేటీఆర్ కళాశాల రోడ్డులోని రైల్వేగేటును వెడల్పు చేయాలని కోరుతూ భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి మురళీకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణ మంగళవారంతో ఆరో రోజుకు చేరుకుంది. స్థానిక కేటీఆర్ కళాశాల రైల్వేగేటు వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన క్రమంలో భీమవరం గేటును మూసివేసి కేటీఆర్ కళాశాల రైల్వేగేటు వైపుకు ట్రాఫిక్‌ను మళ్లీస్తారని తెలిపారు. రైల్వేగేటు వెడల్పుతో పాటు ఐఎంఏ హాల్ రోడ్డును అభివృద్ధి చేయాలన్నారు. చింతల కాలువకు ఇరువైపులా ఉన్న రహదారులను అభివృద్ధి చేసి అరవపేట, మందపాడు గేటుల మీదగా ట్రాఫిక్ మళ్లించాలని ఆయన కోరారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో సభ్యులు మహ్మమద్ తాహెర్ భాషా, జి.పూర్ణచంద్రరావు, సయ్యద్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

నీటిసరఫరాకు అంతరాయం నేడు

గుడివాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ మున్సిపాల్టీ హెడ్ వాటర్ వర్క్స్‌లో రా-వాటర్ గ్రావిటీ సప్లై పైపులైను గల జీరో వెలాసిటి వాల్వ్‌లో మరమ్మత్తులకు గురైంది. దీంతో పట్టణంలో బుధవారం నీటిసరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వాటర్ ప్యూరీఫైయర్ వితరణ

కూచిపూడి : ప్రవాస భారతీయురాలు గీతా అపర్ణ కూచిపూడి సిద్దేంద్ర కళాపీఠానికి రూ.50 వేలు విలువ చేసే వాటర్ ప్యూరీఫైయర్, మైక్‌సెట్ వితరణగా అందించారు. కళాపీఠం ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ డా.చింతా రవిబాలకృష్ణలు అపర్ణకు అభినందనలు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలలు నింబధనలు పాటించాలి

● ఎంఈవో-2 బాలాజీ

గుడివాడ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఎంఈవో-2 బాలాజీ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల నిర్వాహకులతో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు నూతన నియామకాల్లో 25 శాతం పేద వారికి సీట్లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆయా పాఠశాలల్లో సీట్లు కొంతమంది పేదవారికి కేటాయించినట్లైతే ఆ ఫీజును ప్రభుత్వం చెల్లిస్తుందని స్పష్టం చేశారు. పాఠశాల నిర్వాహకులు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో -1 జగన్మోహన్‌రావు, వివిధ పాఠశాలల ప్రైవేట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో -2 బాలాజీ

తోడేళ్లదిబ్బలంకలో సుడిగాలి బీభత్సం

తోట్లవల్లూరు: రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంకలో సోమవారం రాత్రి సుడిగాలిబీభత్సం సృష్టించింది. దట్టంగా మబ్బులు కమ్ముకు వచ్చి ఒక్క నిమిషం పాటు సుడిగాలి వీచింది. ఈ బలమైన గాలికి కొబ్బరిచెట్టు విరిగి రామాలయంపై పడగా శ్లాబు దెబ్బతింది. ఆ పక్కనే ఉన్న కరెంటు స్తంభం విరిగి చేతిపంపుపై పడింది.

గుడివాడలో భారీ వర్షం

గుడివాడ : గత వారంరోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలతో సతమతమవుతూ, ఉక్కపోతలతో అల్లాడుతున్న గుడివాడ ప్రజలకు మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో ఊరట లభించింది, అకస్మాత్తుగా వీచిన గాలులతో కురిసిన భారీ వర్షానికి పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్ బానోతు

గుడివాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యమని గుడివాడ హోమియో రిసెర్చ్ సెంటర్(ఆర్.ఆర్.ఐ) అసిస్టెంట్ డైరెక్టర్ కిషన్ బానోతు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఆర్ఐ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని అనేక హోమియో సెంటర్ల కంటే అత్యున్నత వృద్ధిరేటు సాధిస్తూ గుడివాడ ఆర్ఆర్ఐ ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఐదుగురు స్పెషలిస్ట్ వైద్యులు, అత్యాధునిక వైద్య యంత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. దక్షిణ భారతదేశంలోని ఒరిస్సా, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు గుడివాడలో చికిత్స పొందుతున్నారన్నారు. ఈ సమావేశంలో సైంటిస్ట్ వైద్యులు డా.శివప్రసాద్ గోలి, డా.హీరాసైన్‌కుమార్, డా.బృంద, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

వృద్ధులకు భోజన వసతి

గుడివాడ : స్థానిక బేతవోలులోని శాంతి వృద్ధాశ్రమంలో ఆంజనేయ స్వామి దేవస్థాన మాజీ సభ్యులు కంతేటి హరిబాబు సౌజన్యంతో శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షులు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు భోజన వసతి కల్పించారు. వైసీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు జాన్‌విక్టర్, వైసీపీ జిల్లా నాయకులు మండలి హనుమంతరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా నాగరాజు

కోడూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాలకాయితిప్ప మెరైన్ మత్స్యసహకార సంఘం అధ్యక్షుడిగా చెన్ను నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎఫ్‌డీఓ ఎం.రవికుమార్ తెలిపారు.పాలకాయితిప్ప కమ్యూనిటీ హాలులో మంగళవారం మత్స్య సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. సంఘం ఉపాధ్యక్షులుగా చిలకలపూడి ములసయ్య, కార్యదర్శిగా చెన్ను నాగపోతురాజు ఎన్నికైనట్లు రవికుమార్ తెలిపారు. కోలా నరేంద్ర కుమార్, పాలకాయితిప్ప సాగర మిత్ర చిలకలపూడి మోషే పాల్గొన్నారు.



నియామకపత్రం అందజేస్తున్న ఎఫ్‌డిఓ రవికుమార్

కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నియోజకవర్గంలో కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గస్థాయి నాయకుల, కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జిలకు, నాయకులకు టీడీపీ సభ్యత్వ కార్డులను మంత్రి కొల్లు రవీంద్ర, ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అందజేశారు. సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసి సబ్సిడీ రుణాలను పేదలు సద్వినియోగం చేసుకునేలా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ ఇచ్చే రూ.2 లక్షలను రూ. 5లక్షలకు పెంచేందుకు యోచిస్తున్నామన్నారు. ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నంలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టడం ముదావహమన్నారు. అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేసిన హసీంబేగ్, అక్కుమహంతి రాజాలను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, రోండి కృష్ణయాదవ్, తలారి సోమశేఖర్, ఎండీఇలియాస్ పాషా తదితరులు పాల్గొన్నారు.



హసీంబేగ్‌ను సత్కరిస్తున్న మంత్రి కొల్లు ,ఇన్‌ఛార్జి మంత్రి సుభాష్, తదితరులు

అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టీడీపీ నాయకుడు చింతా చిన్ని మాత్యమూర్తి చింతాభాగ్యలక్ష్మి అంత్యక్రియల్లో మంత్రి కొల్లు రవీంద్ర, మరకాని పరబ్రహ్మం, పిప్పళ్ళ కాంతారావు తదితరులు పాల్గొన్నారు. ఇటీవల మృతిచెందిన టీడీపీ నాయకుడు పామర్తి నాగభూషణం కుటుంబ సభ్యులను మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు.

విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మచిలీపట్నం బచ్చుపేటలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి మంగళవారం హనుమత్ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శ్రీ బాలా త్రిపుర సుందరీ నృత్య నికేతన్ ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి సమ్మెట ఆంజనేయస్వామి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శ

అవనిగడ్డ : శ్రీరామనవమి రోజున కొత్తపేట రేవులో మోదుమూడి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు రేవులో మునిగి మృతి చెందిన సంఘటన తెలుసుకున్న కనపర్తి శ్రీనివాసరావు వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం ఏదైనా ఉంటే ఇప్పిస్తానన్నారు. ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న మాజీ సర్పంచ్ రాఘవులును పరామర్శించారు. కార్యక్రమంలో కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, బచ్చు రఘునాథ ప్రసాద్, బచ్చు మారుతి, మెరుగు సోమిరెడ్డి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు

మోపిదేవి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలంటూ మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి జనసేన నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలి వెంకట్రామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూషడపు రత్నగోపాల్, నడకుదుటి జనార్దనరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

మోపిదేవి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి తెనాలికి చెందిన జి.వెంకట్, రాధ దంపతులు రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. మంగళవారం ఉదయంఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు విరాళం అందజేశారు.

విద్యాసంస్థల పరిస్థితులను గమనించాలి

పెడన, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంస్థల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని ఎస్సై జి. సత్యనారాయణ సూచించారు. పోలీసు స్టేషన్‌లో మంగళవారం మహిళా సంరక్షణ కార్యదర్శులు (ఎంఎస్‌కే)లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ, విద్యాసంస్థల వద్ద అవాంఛనీయ పరిస్థితులు నెలకొని ఉంటే వెంటనే ఆ సమాచారాన్ని తనకు అందించాలన్నారు. డ్వాక్రా గ్రూపు మహిళలతో తరచూ సమావేశాలు నిర్వహించి వారు అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూసేలా చైతన్యపరచాలన్నారు. పాఠశాలల వద్ద ఉచితంగా చాక్లెట్‌లు ఇచ్చే వారిపై దృష్టిసారించాలని ఆదేశించారు.

అంగరంగ వైభవంగా చందనోత్సవం

చల్లపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రామానగరంలోని శ్రీహనుమత్ సాయి నిలయంలో చందనోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం సాయిబాబాను పంచామృతాభిషేకం, నక్షత్రమాలిక తదితర పూజా కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. సాయంత్రం చల్లపల్లి బస్టాండ్ సమీపాన ఉన్న శ్రీషిర్డి సాయిబాబా జ్ఞానమందిరం నుంచీ రామానగరం శ్రీహనుమత్ సాయి నిలయం వరకు భక్తుల గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై సాయి పాదుకలతో పల్లకీసేవ, ఊరేగింపు ముందు వరుసలో గుర్రం, చందనపు పళ్లెములు చేతబట్టి మహిళలు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. గ్రామోత్సవం రామానగరం హనుమత్ సాయి నిలయానికి చేరుకోగా, మచిలీపట్నానికి చెందిన జనాబ్ మహ్మద్ ఖాసీమ్, షేక్ హఫీజ్ అహ్మద్‌లచే చందనోత్సవం జరిగింది. ఎస్.శివరామప్రసాద్(బుజ్జిబాబు), కళ్లేపల్లి బలరాం, వాసుబాబు, రావులపల్లి సాయిరాం, కొండూరు శ్రీనివాసరావులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆధ్యాత్మికవేత్త నాదెళ్ల శివరామకృష్ణ పాల్గొన్నారు.



చల్లపల్లిలో సాయిబాబా భక్తుల గ్రామోత్సవం

ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు

తీన్‌మార్, మేళతాళాల నడుమ దేవతామూర్తుల వేషధారణలు గ్రామోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారులు కొనకళ్ల మనోజ్, ఎస్.సంజనలు శివపార్వతులుగా అద్భుతంగా నర్తించారు. తెన్నేటి వాసుదేవరావు గణపతిగా, శంకుల బెన్ను పాల్గొన్నారు.

మా పాపకు న్యాయం చేయండి

• డీఈవోకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదంటూ ఆవేదన

మోపిదేవి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో రావివారిపాలెం గ్రామానికి చెందిన ప్రసన్నసాయి అనే విద్యార్థిని ఫిజికల్ సైన్స్ పరీక్షలో ఓ జవాబును ఇన్విజిలేటర్ కొట్టివేసిన ఇన్విజిలేటర్‌పై చర్యలు తీసుకోవాలంటూ విద్యార్థిని తల్లి సి.హెచ్.లక్ష్మి డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మార్చి 26న జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షలో నాలుగు మార్కుల జవాబును ఇన్విజిలేటర్ మాధవి బలవంతంగా కొట్టి వేసిందని ఆరోపించారు. దీనిపై చీఫ్ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. రెండు రోజులుగా గడిచినా పట్టించుకోకపోవటంతో డీఈవోను స్వయంగా కలసి ఫిర్యాదు చేశామన్నారు. పది రోజులుగా గడిచినా తమకు ఎటువంటి సమాధానం చెప్పలేదని, చర్యలు తీసుకోకుండా దాట వేస్తున్నట్లు విద్యార్థిని తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇన్విజిలేటర్‌పై చర్యలు తీసుకుని మా పాపకు న్యాయం చేయాలని తల్లి కోరారు.



ఫిర్యాదు లేఖను చూపుతున్న విద్యార్థిని, ఆమె తల్లి

పెరటి తోటల పెంపకంతో ఆదాయం, ఆరోగ్యం

మోపిదేవి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పెరటి తోటల పెంపకం ద్వారా ఆదాయం వృద్ధి చెందటంతోపాటు మంచి ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి తెలిపారు. రావివారిపాలెం గ్రామంలో మంగళవారం సంపూర్ణ పోషణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు, పాఠశాల విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు పెరటి తోటల పెంపకంపై దృష్టిసారిస్తే అవసరమైన శిక్షణా కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందించటం జరుగుతుందన్నారు. శాస్త్రవేత్తలు రేవతి, వెంకటలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన భవనం కూల్చివేత

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : శిడింబి అగ్రహారంలోని మునిసిపల్ పార్కులో ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా న్యాయస్థానం ఆదేశాల మేరకు పురాతన, శిథిలావస్థకు చేరిన భవనాన్ని మునిసిపల్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ బాపిరాజు మాట్లాడుతూ, నగరంలో ఆక్రమణల తొలగింపులో భాగంగా అన్ని డివిజన్లలోనూ ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు. శిడింబి అగ్రహారంలోని మునిసిపల్ పార్కులో పురాతన, శిథిలావస్థకు చేరిన భవనం వల్ల పార్కుకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున ఆర్.వి.ఎస్. మురళీధర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా న్యాయాధికారి తీర్పు మేరకు బిల్డింగ్‌ను కూల్చివేయడం జరిగిందన్నారు. పార్కును అభివృద్ధి చేస్తామన్నారు.డాక్టర్ ప్రసాద్, కాళీపట్నపు రఘు, రవికుమార్, కొనకళ్ళ భానుప్రసాద్, పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు.



శిడింబి అగ్రహారంలో కూల్చివేస్తున్న పురాతన భవనం

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు దుస్తులు, నిత్యావసరాలు అందిస్తున్న ఎంపీపీ, కూటమి నాయకులు

మోపిదేవి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన నాలుగు కుటుంబాలకు మంగళాపురం గ్రామానికి చెందిన రావెళ్ల ఫౌండేషన్, పురిటిగడ్డకు చెందిన ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ వేర్వేరుగా సహాయాన్ని అందించారు. ఒక్కొక్కరికీ ఐదు కేజీల బియ్యం, నిత్యావసరాలు, దుస్తులు, రూ.1000 సంస్థ ప్రతినిధులు అందించారు. ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ వేములపల్లి సురేష్, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ దుస్తులు, బియ్యం, టార్పాలిన్‌లు, ఒక్కొక్కరికి రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, ఎంపీ రావి దుర్గావాణి,రావి నాగేశ్వరరావు, పూషడపు రత్నగోపాల్, మెరకనపల్లి నరేష్ ఉన్నారు.

పులిగడ్డలో స్వల్ప అగ్ని ప్రమాదం

అవనిగడ్డరూరల్,: పులిగడ్డ పంచాయతీలోని సాయిబాబా ఆలయం వద్ద చెత్తాచెదారం అంటుకుని ఆ పక్కనే ఉన్న చెట్లకు మంటలు వ్యాపించటంతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సర్పంచ్ దాసరి విజయ్ కుమార్‌కు సమాచారమిచ్చారు. అవనిగడ్డ నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

మట్టి నమూనా సేకరణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్యామల

ఘంటసాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలో మట్టి నమూనా సేకరణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ ఎస్.శ్యామల మాట్లాడుతూ ప్రతీరైతు విధిగా భూసార పరీక్షలు చేయించుకుని ప్రయోగశాల ఫలితాల ఆధారంగా పోషక ఎరువులు వాడుకుని ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. అధిక నికర ఆదాయాన్ని పొందటంతోపాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు. ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ 13 రైతు సేవ కేంద్రాల పరిధిలోని రైతుల పొలంలో నుంచి 1082 మట్టి నమూనాలను సేకరించి, పరీక్షించి ఫలితాలను జూన్ నాటికి అందజేయనున్నట్లు తెలిపారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రైతులతో కేవీకే శాస్త్రవేత్తల సమావేశం

చల్లపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య ఎన్‌జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషివిజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్తల బృందం చల్లపల్లి రైతుసేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. మట్టినమూనాల సేకరణ, భూసార పరీక్షల ముఖ్యోద్దేశ్యం, ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, సస్యరక్షణ శాస్త్రవేత్తలు డాక్టర్ కె.రేవతి, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి మాట్లాడారు. మట్టిపరీక్షలు చేయటం వల్ల ఉదజని సూచిక, లవణ సూచిక, నత్రజని భాస్వరం, పొటాష్, సూక్ష్మపోషకాలను ఎంతమోతాదులో ఉంటాయో అలాగే సమస్యాత్మక నేలలు గురించి తెలుసుకోవచ్చన్నారు. మట్టిపరీక్షలు చేయించుకోవాల్సిన వారు ఘంటసాల కేవీకేను సంప్రదించాలని సూచించారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో నకిలీ దందా

నాగాయలంక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఫోన్ చేసి నేను.. ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను మాట్లాడుతున్నా అని నలుగురి నుంచి ఒక నకిలీ అధికారి గూగుల్ పేతో నగదు వసూళ్లు చేసినట్లు నలుగురు వ్యాపారులు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాగాయలంకకు చెందిన భోజన హోటల్ యజమాని మాదివాడ శ్రీమన్నారాయణ, గానుగ పిండి మిల్లు యజమాని కమ్మిలి రాజారమేష్, ఫాస్ట్ ఫుడ్ యజమాని కమ్మిలి మనోజ్, మిఠాయిషాపు యజమాని గుడివాక శివాజీ నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.7,855లు వసూళ్లు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై కె.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ భూముల కౌలు వేలం వాయిదా

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం గొడుగుపేటలో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి ఆలయ కౌలు భూముల వేలం వాయిదా వేసినట్లు ఈవో కె.వి. గోపాలరావు తెలిపారు. దేవస్థానానికి చెందిన వడ్లమన్నాడులోని భూమిని ఈనెల 10న బహిరంగంగా కౌలు వేలం నిర్వహించాల్సి ఉంది. అయితే మోటూరులో జరుగుతున్న సీతారామస్వామి ఉత్సవాలదృష్ట్యా వేలాన్ని వాయిదా వేసినట్లు ఈవో తెలిపారు. తదుపరి వేలం ఎప్పుడు వేసేది తెలియచేస్తామని ఈవో అన్నారు.

డ్రోన్ సహాయంతో అదుపులోకి జూదరులు

చల్లపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : డ్రోన్ సహాయంతో పేకాట ఆడుతున్న జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. డ్రోన్ సహాయంతో ప్రత్యేక బృందం దాడులు నిర్వహించారు. చల్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిమ్మగడ్డలో పొలంగట్టున పేకాట ఆడుతున్నవారిపై దాడులు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ.1300 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. వారి నుంచీ మూడు సెల్‌ఫోన్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడు కనిపించడంలేదని కేసు

చల్లపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : యువకుడు కనిపించడంలేదని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మంగళాపురం గ్రామ దళితవాడకు చెందిన కైతేపల్లి సతీష్(20) సోమవారం ఉదయం నుంచి కనిపించటం లేదని సోదరుడు బన్ను ఫిర్యాదుచేశాడు. గ్రామానికి చెందిన చంద్ర ఆనంద్ విశ్వమోహన్(చిన్నబాబు) ఇంటివద్ద పనిచేస్తూ వారి ఇంటివద్దనే ఉంటున్నాడు.సోమవారం కనిపించకపోవటంతో చిన్నబాబు సమాచారం ఇవ్వగా గ్రామ పరిసరాలు వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ నిషేధంలో భాగస్వాములు కావాలి

పెడన రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ భూతం మానవాళి మనుగడకు ప్రమాదకరమని ప్లాస్టిక్ వాడకం నిషేధించాలంటూ పెడనలో యువకులు పలు ప్రాంతాల్లో ఫెక్సీలు ఏర్పాటు చేశారు. ఇటువంటి విషయాలను ప్రభుత్వం ప్రచారం చేస్తున్నా ప్రజలుకూడా దానిలో భాగస్వామ్యం కావాలని పర్యావరణ పరిరక్షణలు అంటున్నారు. కర్రీ పాయింట్, టిఫిన్ సెంటర్లలో, హోటళ్లలో, విందు వినోద భోజనాలలో ప్లాస్టిక్ కవర్ల వాడకం ఎక్కువగా ఉంది. వాటిని నిషేధించాలన్నారు. వ్యాపార వర్గాలు ప్లాస్టిక్ నిధానికి ముందడుగు వేయాలని యర్ర సుబ్రహ్మణ్యేశ్వరరావు కోరారు.

కార్పొరేషన్ రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

పెడన, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం పెడన మునిసిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 373 మంది దరఖాస్తు చేసుకోగా, 301 మంది హాజరయ్యారు. స్టేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ ఇండియా, సప్తగిరి బ్యాంకుల మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కమిషనర్ ఎం. గోపాలరావు, బీసీ కార్పొరేషన్ అధికారులు, కౌన్సిలర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానము, గొడుగుపేట, చల్లరాస్తా సెంటర్, మచిలీపట్నం, కృష్ణాజిల్లా

టెండర్ - కం - బహిరంగ వేలంపాట ప్రకటన

కృష్ణాజిల్లా, మచిలీపట్నం టౌన్, గొడుగుపేట, చల్లరాస్తా సెంటర్లో వేంచేసియున్న శ్రీ వేణుగోపాలస్వామివారి దేవస్థానము నకు సంపూర్ణ భుక్తములు కలిగి నటువంటి దేవస్థానం యొక్క తూర్పు రోడ్ వైపు గల షాపు యందు వ్యాపారం చేసుకోను అద్దె లీజు హక్కునకు దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల సమక్షములోన **ది.19-4-2025 శనివారం ఉదయం గం. 10-30 ని.లకు** దేవస్థానము వద్ద టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహించబడును. కావున ఆసక్తి గల వారు సదరు టెండర్ కం- బహిరంగ వేలంపాట పాల్గొనవలసినదిగా కోరడమైనది.

షాపు వివరములు :

వ.నెం.	డోరు నెం.	షాపు కొలతలు	ధరావత్తు రూ.	సెక్యూరిటీ డిపాజిట్ రూ.	కాలపరిమితి
1	10/414 A	23 x 10 షాపు ముందు వరండాతో కలిపి	షాపుకి **25,000/-**	పాట అయిన వెంటనే హెచ్చుపాట దారు షాపు 1కి 12 మాసాలు అద్దె చెల్లించ నిర్ణయం	షాపు స్వాధీనం చేసిన దగ్గర నుండి 3 సంవత్సరములు
2	10/414 B	23 x 10 షాపు ముందు వరండాతో కలిపి	షాపుకి **25,000/-**	పాట అయిన వెంటనే హెచ్చుపాట దారు షాపు 1కి 12 మాసాలు అద్దె చెల్లించ నిర్ణయం	షాపు స్వాధీనం చేసిన దగ్గర నుండి 3 సంవత్సరములు
3	10/414 C	23 x 10 షాపు ముందు వరండాతో కలిపి	షాపుకి **25,000/-**	పాట అయిన వెంటనే హెచ్చుపాట దారు షాపు 1కి 12 మాసాలు అద్దె చెల్లించ నిర్ణయం	షాపు స్వాధీనం చేసిన దగ్గర నుండి 3 సంవత్సరములు
4	10/414 D	23 x 10 షాపు ముందు వరండాతో కలిపి	షాపుకి **25,000/-**	పాట అయిన వెంటనే హెచ్చుపాట దారు షాపు 1కి 12 మాసాలు అద్దె చెల్లించ నిర్ణయం	షాపు స్వాధీనం చేసిన దగ్గర నుండి 3 సంవత్సరములు

1. ఈ టెండర్ - కం - బహిరంగ వేలంపాట దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి కార్యనిర్వహణాధికారి వారిచే జరుపబడును. 2. టెండర్ - కం - బహిరంగ వేలంపాటలో పాల్గొనదలచిన వారు ముందుగా షాపు 1కి రూ.25,000/- ధరావత్తు చెల్లించి, రూ. 5,00,000/-లు విలువ కలిగిన నిష్పేచి గల స్థిరాస్థి డాక్యుమెంట్స్ లేదా పట్టాదారు పాస్ పుస్తకము దేవస్థానమునకు ఇచ్చి పాల్గొనవలెను. పాట ఆఖరున హెచ్చు పాటదారు ధరావత్తు తప్ప మిగిలిన వారి ధరావత్తు తిరిగి ఇవ్వబడును. 3. సదరు షాపు హెచ్చుపాటదారుడు షాపు 1కి అంగీకరించిన హెచ్చుపాట నెలసరి అద్దె ఒక సంవత్సరం అద్దె మొత్తం పాట అయిన వెంటనే చెల్లించు నిర్ణయం. అట్లు చెల్లించిన యెడల పాటను రద్దు పరచి మీరు కట్టిన డిపాజిట్ ఫర్ఫట్ చేసి మరల వేలం పాట పెట్టు నిర్ణయము. 4. సదరు ధరావతుగా చెల్లించిన రూ.25,000/- లు మరియు 12 మాసాలు అద్దె తిరిగి కాలపరిమితి ముగిసిన పిదప దేవస్థానమునకు షాపు స్వాధీనము చేసిన తరువాత ఇవ్వబడును, దీనికి వడ్డీ ఇవ్వబడదు. 5. ఇతర వివరములు దేవస్థానము కార్యాలయములో లేదా పాట కాలమందు తెలియపరచబడును.

మచిలీపట్నం, ది.7-04-2025

తిక్కిశెట్టి వీర వెంకట మోహనరావు, కార్యనిర్వహణాధికారి
సెల్ : 9848571477